honeybee.org
Vol-6 Issue-4

సంపుటి 6 సంచిక 4 మే - జూన్ 2018

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక










# జీవిత చక్రం



జొన్నలు పండించే ఒక రైతుకి ప్రతిసారీ రాష్ట్ర వ్యవసాయ పోటీల్లో మొదటి బహుమతి వస్తూ వుండేది. ఒకరోజు ఒక స్థానిక వార్తాపత్రిక వారు ఆయనతో మాట్లాడదామని వచ్చారు. ఆ రైతు తన జొన్న విత్తనాలు చుట్టుప్రక్కల రైతులతో పంచుకునే అలవాటును చూసి వచ్చిన విలేకరి ఆశ్చర్యపోయాడు. అతను ఆ రైతుతో అయ్యా మీ మంచి విత్తనాలను ఇతరులతో పంచుకుంటున్నారు కదా వారు నీకు పోటీగా తయారౌతారు కదా , వారికి సహాయం చేయటం సమంజసమేనా అన్నాడు. దానికా రైతు 'ఏం సార్ మీకు తెలియదా ఎండిన జొన్న పంటలోని పుప్పొడి గాలికి ఒక పంట నుంచి ఇంకొక పంటకు వెదజల్లుతూ వుంటుంది. నా పక్కవారు నాశిరకం జొన్నలు వేస్తే ఆ నాశిరకం పుప్పొడి సంపర్కం వల్ల నా జొన్నలు కొంత కాలానికి వాసి తగ్గిపోతాయి కదా. నేను మంచిరకం జొన్నలు పండించాలి అంటే నా చుట్టుప్రక్కల వారు కూడా మంచి జొన్నలు పండించేలా చూసుకోవాలి' అన్నాడు.

ఈ కథ జీవితాల సంబంధాల గురించి తెలుపుతుంది. మనకి మంచి జొన్నలు కావాలంటే అంతా మంచి జొన్నలే పండించాలి కాబట్టి ఇతరులకు సహాయం చేయనిదే మన జీవితమూ బాగుపడదు. ఒకరి శ్రేయస్సు అందరి శ్రేయస్సుతో ముడిపడి వుంటుందని గుర్తించాలి. ప్రకృతి నేర్పే ఈ పాఠాన్ని మనం క్షుణ్ణంగా నేర్చుకుని అమలు పర్చాలి.

**– హనీబీ 15(4) – 2005**

# పల్లెసృజన

సంపుటి-6 సంచిక-4 మే - జూన్ 2018



పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్– 500 094.
ఫోన్ : 040–27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit at :www.pallesrujana.org



**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం,**

సంపాదకులు :
**జమ్ములమడక శశిమోహన్,**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త,**
**పి. చంద్రకాంత్ శర్మ,**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్,**
**జమ్ములమడక శ్రీకర్,**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్,** హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com


**Rs. 800/-**
**for 5 years Subscription**

## విషయ సూచిక



3 మొక్కజొన్న విత్తేందుకు సృజనాత్మక పరికరం తయారు చేసిన ఆవిష్కర్త 'సంగెపు బాబు'


7 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలు బహుమతి పొందిన ఇన్నోవేషన్లు


11 అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎటిఐ) నిర్వహించిన ప్రేరణ-2018 లో గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ల ప్రదర్శన


12 "పరిపూర్ణ రైతు" భూమేశ్వర్


15 విజయవాడలో పల్లెసృజన ద్వారా 'ఇన్నోవేషన్ల విస్తృతి కేంద్రం' ప్రారంభం


18 జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు


19 నిర్వహణ ఖర్చులు లేని 'సోలార్ సెల్‌ఫోన్ ఛార్జర్'


21 స్వల్ప ఖర్చుతో వ్యవసాయం ఖచ్చితంగా సాధ్యమే - మునిరత్నం నాయుడు


28 హీరో హోండాతో సులువైన వీడర్


30 ఆయుర్వేద జ్ఞాన మథనం 'మెంతులు'తో వైద్య చిట్కాలు

కవర్ లోపలి పేజీల్లో ... **జీవిత చక్రం** హనీబీ కథ, అమ్మకానికి సిద్ధంగా వున్న 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్'

మధ్య పేజీలో : 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు పొందిన అవార్డులు



Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**


## HoneyBee Regional Collaborators & Publications


**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# రైతుల సహనాన్ని పరీక్షించకండి

'పల్లెసృజన' ప్రతి 3 నెలలకోసారి జరిపే 'శోధయాత్ర'లో భాగంగా జూన్ 2018లో 27వ చిన్న శోధయాత్ర నాగర్ కర్నూలు జిల్లా పెద్దకొత్తపల్లి గ్రామం నుండి సోమశిల వరకు జరిగింది. ఇది వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఎక్కువమంది ప్రజలు వ్యవసాయం మీదనే ఆధారపడి జీవిస్తున్నారు. అన్నిచోట్ల లాగే ఇక్కడ కూడా రైతుల బాధలు అలాగే ఉన్నాయి అనిపించింది. ప్రభుత్వాలు ప్రాజెక్టుల నిర్మాణం, చెరువుల మరమ్మతులు, గిడ్డంగుల నిర్మాణం, వ్యవసాయ పరిశోధనల రూపంలో ఎన్నో కొత్త కొత్త పథకాలతో కోట్లాది రూపాయలు వ్యవసాయ రంగానికి కేటాయిస్తున్నప్పటికీ రైతుల పరిస్థితుల్లో చెప్పుకోదగ్గ మార్పు కనిపించటం లేదు. ఎందుకిలా అవుతుంది? పథకాల ఆలోచనల్లో మార్పు రావాలా? వాటి అమలులో లోపముందా? ఇంకా ఎంతకాలం వ్యవసాయదారులు కష్టపడుతూ నష్టపడాలి? డా. స్వామినాథన్ కమిటీ సలహాలు సరియైనవేనని అన్ని వర్గాలు సమ్మతించినప్పటికీ వాటి అమలు ఇంతవరకు ఎందుకు జరగటం లేదో అర్థం కావటం లేదు. ఇదిలాగే కొనసాగితే రైతుల పరిస్థితి మరింత దిగజారే పరిస్థితికి చేరుకుంటుందేమో!

వ్యవసాయం చేయటం కష్టం నష్టం తప్ప గిట్టుబాటుగా ఉండటం లేదన్న విషయం స్థానిక రైతులతో చర్చించినప్పుడు శోధయాత్రికులు వారిలో నిరుత్సాహాన్ని గమనించారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వ్యవసాయం చేయాలని సలహా ఇవ్వటం లేదు. చదువుకొని ఏదో ఓ ఉద్యోగం చేసుకోమనే చెబుతున్నారు. శోధయాత్రలో ఎంతోమంది యువకులతో జరిగిన సంభాషణల్లో ఈ విషయం తేటతెల్లమైంది. ఇదే జరిగితే భవిష్యత్తులో వ్యవసాయం చేయడానికి గ్రామాల్లో రైతులు ఎక్కడుంటారు? యువత ఉద్యోగాలు వెతుక్కుంటూ గ్రామాలనుండి తరలిపోతే పంటలు పండించటానికి రైతుల కొరత ఎదురవుతుంది. ఫలితంగా ఆహార ధాన్యాల కొరతను కూడా దేశం ఎదుర్కోవాల్సి ఉంటుంది.

గత ఏడు దశాబ్దాలలో ప్రభుత్వ పథకాలు ఫలించకపోగా మరింత గడ్డు పరిస్థితికి దారితీయడం, వైద్య, విద్య ఖర్చులు పెరగడం ఇవన్నీ రైతాంగాన్ని ఆలోచింపజేస్తున్నాయి. నిశ్శబ్దంగా ఈ అన్యాయాన్ని సహిస్తూ వచ్చిన వ్యవసాయదారులు సహనం కోల్పోతున్నారు. అందరూ రైతులకు ప్రాధాన్యమిస్తున్నామని ఊకదంపుడు ఉపన్యాసాలిస్తున్నా, తమకు ఒరిగేది ఏమీ లేదని రైతులకు అర్థమవుతున్నది. వారి ఆలోచనల్లో మార్పులు వస్తున్నాయి. ఈ సమస్య ఇతరుల వల్ల కాదు, తామే పరిష్కరించుకోవాలనుకుంటున్నారు. రైతులపై వ్యవస్థ ఆధారపడుతుందే కాని, వ్యవస్థపైన రైతులు ఆధార పడరు అని అర్థమయ్యేలా చేయాలన్న దిశగా వారి ఆలోచనలు సాగుతున్నాయి అన్న విషయం ఈ శోధయాత్రలో తెలిసింది.

రైతులు ఏకాభిప్రాయానికి వస్తున్నారు. అందరూ కలిసి వ్యవస్థకో గుణపాఠం నేర్పాలని ఆలోచిస్తున్నారు. ఓ గ్రామంలో మాతో కలిసి తన అభిప్రాయాలు పంచుకున్న రైతు మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ "దీనికేమీ ప్రత్యేకంగా చేయక్కరలేదు. కేవలం మేము 'కృత్రిమ కొరత'ను సృష్టిస్తే చాలు. రైతులు తమ కుటుంబానికి కావలసిన పంటలు మాత్రమే పండించుకుని, పట్టణ వాసుల కొరకు పండించడం రెండేండ్లు మానేస్తే - ధాన్యం, కూరగాయలు, పప్పులు మార్కెట్ యార్డులకు రావు. గిడ్డంగులు నిండవు. దుకాణాల్లో దినసరి సరుకులు దొరకవు. ఆహార పదార్థాల కొరత వల్ల దేశం అట్టుడుకుతుంది. అప్పుడు కాని ఈ వ్యవస్థకు రైతుల ప్రాధాన్యత, వారి కష్ట నష్టాల గురించి తెలియదు" అని అన్నారు.

ఇదే నిజమైతే, రైతులంతా కలిసి కృత్రిమ ఆహార కొరతను సృష్టించి, తినటానికి తిండి దొరకకుండా చేస్తే మన బ్రతుకులు ఎలా ఉంటాయో ఒక్కసారి ఊహించుకోండి. ఈ ఆలోచనే భయంకరంగా లేదూ! వారి సహనాన్ని పరీక్షించకండి. రైతన్నకు కోపం రాకుండా నష్ట నివారణోపాయాలను వెతికి తక్షణం అమలు చేయాలి. రైతును గౌరవించాలి, ఎల్లవేళలా రైతులను గుర్తించి సమాజంలో వారికి సముచిత స్థానమివ్వాలి. ఇప్పటికైనా మించిపోలేదు సరియైన ప్రణాళికలు వేసి, వాటిని చిత్తశుద్ధితో అమలు చేస్తే రైతులకు "కృత్రిమ కొరత" సృష్టించాల్సిన అవసరం ఉండదని 'పల్లెసృజన' భావిస్తున్నది.

కొత్త వ్యవసాయ సంవత్సరంలో మీ అందరికీ శుభం జరగాలని, నీరు, సూర్యరశ్మి "కొరత" లేకుండా పుష్కలంగా లభించాలని, పంటలకు పెట్టుబడులు తగ్గాలని, దిగుబడి ఎక్కువగా రావాలని, ధరలు సరిగ్గా ఉండాలని, రైతు సంక్షేమం దేశానికి అత్యవసరం అని 'పల్లెసృజన' తరుపున మనసారా నమ్ముతూ, కోరుకుంటూ.....

భవదీయ
బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)





# మొక్కజొన్న విత్తేందుకు సృజనాత్మక పరికరం తయారు చేసిన ఆవిష్కర్త 'సంగెపు బాబు'

- పల్లె వీర రాఘవ రెడ్డి

మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల కేంద్రంలో స్థిర నివాసం ఏర్పరచుకొని, స్వంత షెడ్‌లో వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతు 42 సంవత్సరాల 'సంగెపు బాబు'. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు, తల్లిదండ్రులతో కూడిన ముచ్చటైన కుటుంబం. వంశ పారంపర్యంగా వ్యవసాయ కుటుంబానికి చెందిన బాబు పరిస్థితుల కారణంగా 5వ తరగతికి మించి చదవలేదు. గూడూరుకు మూడు కిలోమీటర్ల దూరంలో గల స్వగ్రామమైన గొల్లపల్లిలో వంశ పారంపర్యంగా సంక్రమించిన 3 ఎకరాల పొలం పనులు చేసుకుంటూ, అదనంగా వెల్డింగ్ షాపు నడుపుకుంటున్నాడు. షాపులో గత పదిహేను సంవత్సరాలుగా ఆ ప్రాంతపు రైతులకు అవసరమైన అన్ని రకాల వ్యవసాయ పరికరాలను నేర్పరితనంతో తయారు చేస్తుంటాడు.

రెండు సంవత్సరాల క్రితం వరకు తన పొలంలో కేవలం వర్షాకాలంలో మాత్రమే వరి పండించేవాడు. మండల కేంద్రంలో వ్యాపారం కావటం వల్ల షాపు పనులు కూడా పెద్ద వ్యాపారమేం కాదు కాబట్టి 'యాసంగి' పంట కూడా వేసుకుంటే బావుంటుంది కదా (అతని భాషలో) అనుకున్నాడు. వరి కోసిన తర్వాత పొలాన్ని మళ్ళీ దున్నకుండా కావలసినంత దూరంలో తాళ్ళు కట్టి, కూలీల చేత మొక్కజొన్న నాటించే వాడు. ఈ నాట్లకు అయ్యే కూలీలు ఎకరాకు దాదాపు 15 మంది దాకా అయ్యేది. మొక్కజొన్న పంటను పండించటం, దున్నటం, కలుపు తీయటం లాంటి ఖర్చులు పెరిగిపోవటంతో, నాటు కూలీల ఖర్చునైనా మిగిల్చ గలిగితే బావుంటుంది అని ఆలోచించాడు. కేవలం ఇద్దరు ముగ్గురు కూలీల ఖర్చుతో మొక్కజొన్న నాటే పని జరిగిపోయేలా చెయ్యాలని ఎంతో



ఆలోచించాడు. ఈ విధంగా చేయటం వల్ల సమయం కూడా చాలావరకు కలిసి వస్తుంది. వరి కోసిన తర్వాత పొలం కొన్ని రోజులు ఆరబెట్టి దున్నటం, మళ్ళీ నీరు కట్టి విత్తనం వేయటం లాంటి పనులన్నీ చేయటానికి కనీసం నెల రోజులు పడుతోంది. అలా కాకుండా వరి కోసిన వెంటనే అదే పదునులో నాటుకుంటే ఈ సమయమంతా కలిసి వస్తుంది అని ఆలోచించాడు.

పొలంలో వరి కోసిన వెంటనే భూమి పదునులోనే కూలీలు విత్తనాలు నాటాలంటే ఒక కర్రతో భూమికి రంధ్రం చేసి, ఆ రంధ్రంలో విత్తనం వేసి వేలితో మూసివేసేవారు. ఇలా రెండు సంవత్సరాలు చేశాడు. ఇది కూడా కాస్త ఖర్చుతో కూడుకున్నదే అని, రంధ్రాలు చేయటానికి అనువుగా ఒక చక్రాల బండి తయారు చేస్తే బావుంటుందని తన వెల్డింగ్ బుర్రతో ఆలోచించి పరికరం చేయటం మొదలు పెట్టాడు. తన షాపులో వృధాగా పడివున్న ఇనుప ముక్కలతో మూడు నాలుగు రకాల చక్రాల బండ్లను చేసి చూసి వాటి పనితీరు నచ్చక పోవటంతో మళ్ళీ తన ఆలోచనలకు పదును పెడుతూ చివరకు అద్భుతంగా పని చేసే ఒక చక్రాల పరికరం తయారు చేశాడు.

ఈ పరికరంలో 22 అంగుళాల పొడవైన ఒక కడ్డీకి బేరింగులు అమర్చి వాటికి రెండు చక్రాలను ఏర్పాటు చేశాడు. ఆ చక్రాలకు 8 అంగుళాలకు ఒక మొల చొప్పున వెల్డింగ్ చేశాడు. ఈ పరికరాన్ని వ్యక్తి తోసేందుకు వీలుగా మూడు అడుగుల పొడవు గల ఒక చట్రాన్ని ఏర్పాటు చేశాడు. అంతా పూర్తయ్యాక ఇది తప్పకుండా విజయవంతంగా పని చేస్తుంది అని అనుకుని పొలంలో మొక్కజొన్న విత్తేందుకు తీసుకు వెళ్ళాడు.

ఈ పరికరం సహాయంతో కేవలం ముగ్గురు వ్యక్తులు ఎకరం పొలంలో మొక్కజొన్న నాటవచ్చు. గతంలోలా ప్రతి సాలుకు తాళ్ళు కట్టాల్సిన అవసరం కూడా లేదు. కేవలం గుర్తుగా వుండటం కోసం అక్కడక్కడ ఒక తాడు కడితే చాలు. ఆ తాడు ఆధారంగా ఒక వ్యక్తే నేరుగా ఈ చక్రాల బండిని నడుపుకుంటూ వెళ్తాడు. ఆ చక్రాలకు ఏర్పాటు చేసిన కడ్డీలు 8 అంగుళాలకు ఒక రంధ్రం చేసుకుంటూ వెళ్తాయి. ఇద్దరు వ్యక్తులు ఆ రంధ్రాలలో విత్తనం వేసి వేలితో ఆ రంధ్రాన్ని మూసుకుంటూ వెళ్తుంటారు. గతంలో మనిషి కూలీ రోజుకు రూ. 200 ప్రకారం వేసుకున్నా ఒక ఎకరంలో మొక్కజొన్న నాటేందుకు మూడు వేల రూపాయలు ఖర్చయ్యేది. ఈ పరికరం తయారీతో కేవలం 600 రూపాయల ఖర్చుతో సునాయాసంగా ఎకరం పొలాన్ని విత్తగలరు. వరి కోసిన తర్వాత పొలాన్ని ఆరబెట్టి, దున్ని, విత్తనం వేసే ఖర్చులన్నీ బేరీజు వేస్తే ఎకరానికి దాదాపు 5 నుండి 6 వేల రూపాయల ఖర్చును రైతుకు మిగిలేలా చేసిందీ పరికరం.

ఈ చక్రాల పరికరం సహాయంతో నాటిన మొక్కజొన్న మామూలు పద్ధతిలో సేద్యం చేసి నాటే మొక్కజొన్న కన్నా 20 శాతం అధిక దిగుబడి సాధించింది. పైగా గాలి వానలకు ఈ పైరు నేలకొరిగేది కాదు. దానికి కారణం విత్తనం సరైన లోతులో (దాదాపు ఒకటిన్నర అంగుళాల లోతు) నాటుకోవడం వల్ల మొక్క మొలవటమే దృఢంగా వుంటుంది. పొలం దున్ని విత్తనం వేస్తే మొక్క ప్రధాన వేరు మాత్రం లోతుగా వెళ్తుంది, ప్రక్కవేర్లు పైపైనే వుంటాయి. ఈవిధంగా నాటడం వల్ల మొక్క మొత్తం వేర్లు భూమి లోపలకు వుండటంతో మొక్క కూడా దొడ్డుగా మొలుస్తుంది, పైగా విత్తిన ప్రతి గింజ తప్పకుండా మొలక వస్తుంది అంటాడు బాబు. ఈవిధంగా సంవత్సరానికి ఎకరానికి 52 క్వింటాళ్ళ (సాధారణంగా దాదాపు 40 క్వింటాళ్ళ దిగుబడి వుంటుంది) మొక్కజొన్న పండిస్తున్నాడీ సృజనాత్మక రైతు. విత్తడం తూర్పు పడమర దిశగా సాళ్ళు చేసుకుని నాటితే పంటకు సరియైన సూర్యరశ్మి తగిలి, పంట కూడా ఏపుగా పెరుగుతుంది అంటాడు బాబు. వరుసల మధ్య 20 అంగుళాలు, మొక్కల మధ్య 8 అంగుళాల సమానమైన దూరంలో పంట వుంటుంది. వరిమళ్ళలో గట్ల వద్ద కూడా పరికరం సులువుగా దాటుకుంటూ వెళ్ళటం వల్ల ప్రధాన గట్టు వరకు విత్తనం నాటుకుంటూ వెళ్ళటంతో పొలం మొత్తం ఒకే వరుసలో వున్నట్లు వుంటుంది. ఈ పరికరం సహాయంతో గత



మూడు సంవత్సరాలుగా మొక్కజొన్న నాటుకుంటూ మంచి దిగుబడి సాధిస్తున్నాడు బాబు.

విత్తనం వేయటం వరి కోసిన వెంటనే అదే పనులో వేస్తాడు కాబట్టి పంట మొలిచిన 20 నుండి 25 రోజుల తర్వాత భూమి నీరు లేక పగుళ్ళు బారేటపుడు నీరు అందించి ఆ తర్వాత అవసరమైన ఎరువులు అందిస్తాడు బాబు. పంట మొత్తం 4 నుండి 5 తడుల నీరు అందిస్తే చాలు. వరిమళ్ళు కావటంతో నీరు పెట్టడం కూడా పెద్దగా శ్రమ వుండదు. నీరు ఒక మడి నిండిన తర్వాత మరో మడిలోకి వెళుతూ వుంటాయి కాబట్టి మనిషి దగ్గరుండి నీరు పెట్టాల్సిన అవసరం వుండదు. ఈవిధంగా పంట దిగుబడిలో ఇతర రైతులకన్నా తను 18 క్వింటాళ్ళ వరకు అధికంగా పొందుతున్నాడు.

సంగెపు బాబు తన వెల్డింగ్ షాపు వ్యాపారంలో కూడా రైతాంగానికి అనువైన 'సైకిల్ నాగలి', మోటార్ సైకిల్‌తో సేద్యం చేసేలా పరికరాలు సృజనాత్మకతతో తయారు చేశాడు. వరిమడులలో ట్రాక్టర్‌తో దున్నిన తర్వాత గొర్రు తిప్పటానికి కూడా ట్రాక్టర్ ఎందుకని తానే గొర్రు తిప్పేలా ఒక పరికరాన్ని తయారు చేసుకున్నాడు. ఈ గొర్రుతో నారుమడిని తానే తయారు చేసుకుంటాడు.

**వ్యాయామం చేసే పరికరం తయారీ :**

ఆరు సంవత్సరాల క్రితం ఒకసారి టీవీలో నడుం నొప్పులు తగ్గించేందుకు వ్యాయామం చేసే పరికరాన్ని గమనించిన బాబు సరదాకి తానే ఒక పరికరాన్ని తయారు చేశాడు. ఆ ప్రాంతంలోని ఒక వ్యక్తి ఈ పరికరం చాలా బాగుందని రెండు గంటల సేపు దానిపైన వ్యాయామం చేసి అతను దాన్ని కొనుక్కొని మరీ వెళ్ళాడట. దానిపైన ఎక్సర్‌సైజులు చేయటం వల్ల తన నడుం నొప్పులు తగ్గటంతో పాటు, ఊబకాయం, బొజ్జ కూడా తగ్గి, కాళ్ళు చేతులకు మంచిగా వ్యాయామం జరిగి ఆరోగ్యంగా వున్నానని చెప్పాడన్నాడు.

సంగెపు బాబు ఎంతో సృజనాత్మకత గల వ్యక్తి అని, ఇతను తయారు చేసిన పరికరాల వల్ల తమకెంతో ఆర్థికంగా మేలు జరిగిందని ఆ ప్రాంత రైతులు కూడా కితాబునిచ్చారు.

మొక్కజొన్న నాటేందుకు తయారు చేసిన చక్రాల పరికరానికి ప్రస్తుతం విత్తనం నాటేందుకు ఇద్దరు కూలీలు అవసరం అవుతున్నారు కాబట్టి ఈ కూలీలను కూడా మిగిలించే విధంగా ఒకే వ్యక్తి ఈ పరికరాన్ని తోసుకుంటూ వెళ్తే, దానంతట అదే విత్తనం వేసి, ఆ విత్తనాన్ని పూడ్చే విధంగా కూడా దీనికి మెరుగులు దిద్దాలనే ఆలోచనలో వున్నాడు సంగెపు బాబు.


ఇటీవల మహబూబాబాద్ జిల్లా గూడూరు లోని బాబును 'పల్లెసృజన' బృందం బ్రిగేడియర్ గణేశం, చంద్రకాంత్ శర్మ, వీరరాఘవ రెడ్డి, ముప్పారపు రాజు సందర్శించడం జరిగింది. ఎంతో సృజనాత్మకతతో రైతాంగానికి వ్యవసాయ పరికరాలు తయారు చేయటమే కాకుండా, తన స్వంత పొలంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ పంట పండేలా మొక్కజొన్న నాటే పరికరాన్ని తయారు చేసిన బాబును అభినందిస్తూ ఈ పరికరం విస్తృత వ్యాప్తికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సంగెన బాబు సృజనాత్మకతను చుట్టుప్రక్క గ్రామాల రైతులు ఉపయోగించుకోవటానికి 'పల్లెసృజన' అతన్ని ప్రోత్సహిస్తూ, రైతులకు అవసరమైన కొత్త కొత్త పరికరాలు తయారు చేయమని, అందుకు ఏదైనా ఆర్థిక, సాంకేతిక సహాయం అవసరమైతే అందించటానికి సిద్ధంగా వున్నామని 'పల్లెసృజన' ప్రోత్సహించింది.

**సంగెపు బాబు ఫోన్ నెం.: 94414 13482**

**'పల్లెసృజన' పత్రికను ఇతరులూ చదివేలా చేయండి**

ఇటీవల ఓ వ్యక్తి ఒక తాను అమలు చేస్తున్న వినూత్న పద్ధతిని మాతో పంచుకున్నాడు. తాను 'పల్లెసృజన' పత్రికను పూర్తిగా చదివిన తర్వాత ఒక 'మంగలి షాపు'లో వుంచుతానని, అక్కడైతే వెంట్రుకలు కత్తిరించుకోవటానికి వచ్చి వేచి చూస్తున్న వారు చదివే అవకాశాలు ఎక్కువ అని తెలియజేశారు. మీరు కూడా మీ పత్రికను మీరు చదివిన తర్వాత ఇతరులూ చదివే అవకాశం కల్పిస్తే, మరింత మంది పల్లెజ్ఞానంతో సంధానించ బడతారు. కొత్త కొత్త ఇన్నోవేషన్లు వారు మనతో పంచుకునే అవకాశముంటుంది. - ఎడిటర్



డా. ఎపిజె అబ్దుల్ కలాం

# ఇగ్నైట్ పోటీలు 2018

**"నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది
సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది
ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి
జ్ఞానం మిమ్మల్ని గొప్పవాళ్ళను చేస్తుంది"**

**'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ - ఇండియా'** పాఠశాల విద్యార్థుల కొరకు వారి స్వంత సాంకేతిక ఆలోచనలు మరియు సృజనల జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నది.

**'డా. ఎపి.జె. అబ్దుల్ కలాం ఇగ్నైట్ పోటీలు-2018'** కి దరఖాస్తులు పంపుటకు **చివరి తేది 31 ఆగస్టు, 2018.** ఎన్ఐఎఫ్ పిల్లల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్ దినంగా జరుపుకునే మన మాజీ రాష్ట్రపతి దివంగత డా. ఎపిజె అబ్దుల్ కలాం గారి జయంతి రోజు (అక్టోబర్ 15)న విజేతల పేర్లు ప్రకటిస్తుంది.

అర్హమైనవి అని భావించిన ఇన్నోవేటివ్ ఐడియాలు/ప్రాజెక్టులను 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' గుర్తించి, వాటి అభివృద్ధికి, పేటెంట్‌కు సహకరిస్తుంది. 12వ తరగతి (10+ ఇంటర్మీడియట్) వరకు చదువుతున్న విద్యార్థులు (పాఠశాలేతర విద్యార్థులు, 17 సంవత్సరాల లోపు చిరంజీవులు కూడా) తమ ఎంట్రీలను తమ చిరునామా, పిన్ కోడ్, సెల్ ఫోన్‌తో సహా ఒక కాగితంపై వివరంగా వ్రాసి పోస్టు ద్వారా ఈ క్రింది చిరునామాలకు, లేదా ఈ-మెయిల్ ignite@nifindia.org ద్వారా పంపవచ్చు. ఆన్‌లైన్‌లో ద్వారా కూడా పంపవచ్చు.

పూర్తి వివరాలకు సంప్రదించండి :
**www.nif.org.in/ignite**

**National Innovation Foundation-India**
**Grambharati, Amarapur, Gandhinagar- Mahudi Road,**
**Gandhinagar - 382650, Gujarat, India.**
**Tel : 02764 261131/ 32/ 38/ 39, Fax : 011 43851803**
**E-mail : ignite@nifindia.org, web : www.nif.org.in/ignite**

dst.gov.in honeybee.org gian.org sristi.org cbse.nic.in

# 9వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతి పొందిన ఇన్నోవేషన్లు




- 'ఎన్.ఐ.ఎఫ్. సౌజన్యంతో...

స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## అభివృద్ధి పరచిన సోయాబీన్ (పంఢ్రినాథ్-1)

**రాష్ట్ర స్థాయి బహుమతి :**

**ఇన్నోవేటర్ : కాశీనాథ్ ఎన్ లోకండే బెతుల్, మధ్యప్రదేశ్**



59 సంవత్సరాల వ్యవసాయదారుడు కాశీనాథ్ ఎన్ లోకండే బెతుల్ ఏడాదికి రెండు పంటలు వచ్చే ఒకేసైజు గింజలున్న, అనేక చీడ పీడలను తట్టుకునే మేలురకం సోయాబీన్ రకాన్ని అభివృద్ధి చేశాడు.

కాశీనాథ్ తనకున్న 5 ఎకరాల పొలంలో సోయాబీన్, గోధుమ, శనగ, నారింజ మొదలైన పంటలు పండిస్తుంటాడు. అతని ప్రధాన ఆదాయం మాత్రం నారింజ. తాను 10వ తరగతి వరకు మాత్రమే చదివినా, తన ఇద్దరు కూతుళ్ళు, ఒక కొడుకును బాగా చదివించాడు. అతనికి ఉన్నదల్లా తోడ్పాటు అందిస్తోన్న అతని భార్య. ఆ ప్రాంతంలో అతను కొత్తరకం సోయాబీన్ కనిపెట్టిన వాడిగా ప్రసిద్ధి చెందాడు. తన అన్నగారివల్ల తనకీ ఉత్సాహం వచ్చిచందనే ఆయన తన అన్న నితిన్‌ను గురువుగా భావిస్తానని చెప్తాడు కాశీనాథ్. వ్యవసాయంలోకి రాకముందు ట్రక్కు డ్రైవరుగా పని చేసేవాడు. ఇప్పుడు తన మేనల్లుడు వ్యవసాయ పనులలో సహాయం చేస్తున్నాడు.

**ఆలోచన ఆవిర్భావం :** భారతదేశంలో సోయాబీన్ పంట ఒక ముఖ్యమైన వాణిజ్య పంట. 2008వ సంవత్సరంలో ఖరీఫ్ పంట కాలంలో కాశీనాథ్ తను వేసిన 'బంగా' అంటే 10-12 రోజులు ముందుగానే కోతకు వచ్చే జె.యస్.9752 రకం సోయాబీన్‌లో కొన్ని మొక్కలు చాలా ఆరోగ్యవంతంగా ఉండటం గమనించాడు. వాటినుండి 300 గ్రా. మంచి విత్తనాలు సేకరించి, 2009లో వాటిని ప్రత్యేకంగా నాటగా, 15 కిలోల గింజలు వచ్చాయి. ఆవిధంగా 2012 వరకు చేసి 75 క్వింటాళ్ళ విత్తనాలు తయారు చేశాడు. అప్పటినుంచి తను వాడటమే కాక కావలసిన తోటి రైతులకు ఇస్తూ వచ్చాడు.

**పంఢ్రినాథ్-1 రకం సోయా :** సంవత్సరానికి రెండు కాపులు వచ్చే పంట. 90-95 రోజుల్లో కోతకొస్తుంది. గింజలు పెద్దగా వుండి, అనేక చీడపీడలు, ప్రత్యేకించి 'ఎల్లో మొజాయిక్' చీడని సమర్థవంతంగా తట్టుకొంటుంది. ఎకరాకి





12-15 క్వింటాళ్ళ దిగుబడినిస్తుంది. ఈరకం అతివృష్టి, అనావృష్టి కాలంలో కూడా అంత దిగుబడినిస్తుంది. ఏవిధమైన ఎరువులూ వాడనవసరం లేదు.

ఈ పంఢ్రినాథ్-1 రకం సోయాబీన్ మధ్యప్రదేశ్, గుజరాత్, కర్నాటకలలో వేయగా, 95 నుంచి 100 రోజుల్లో కాపుకొచ్చి, ఏ చీడలు లేకుండా అధిక దిగుబడిని సాధించారు అక్కడి రైతులు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లోని రైతులు ఈరకం విత్తనాలు వాడి చాలా బాగున్నాయని మెచ్చుకున్నారు. 2015లో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ప్రాంతాల్లో వర్షాలు సరిగ్గా పడక అక్కడ వేసిన 6 సోయా రకాలు విఫలమై ఈ పంఢ్రినాథ్-1 రకం ఏమాత్రం తక్కువ కాకుండా చక్కని దిగుబడినిచ్చింది. అలా రెండు సంవత్సరాలు రైతులను వర్షాభావం ఉన్నా రకం అందుకొంది. ప్రాంతీయంగా కాశీనాథ్‌ని అందరూ ఎంతో మెచ్చుకొంటారు. ఎన్నోసార్లు సన్మానాలు చేశారు కూడా. అనేకసార్లు ఇతని గురించి టి.వి., వార్తాపత్రికల్లో ప్రచారం కూడా జరిగింది.

**విత్తనాలు కావాలనుకున్నవారు సంప్రదించండి :**
పల్లెసృజన, ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)

# పామాయిల్ రైతుల సమస్య పరిష్కారిస్తారా?

సమస్య

పామాయిల్ చెట్ల ఆకులు, గెలలు కోయటానికి, పామాయిల్ చెట్టును ఎక్కేందుకు రైతులు ఎంతో ఇబ్బందికి గురవుతున్నారు. ఈ పనులన్నీ ఎంతో ఖర్చుతో కూడుకున్నవి కూడా. ఈ సమస్యలకు పరిష్కారం కోరుతూ ఆ రైతులు 'పల్లెసృజన'ను ఆశ్రయించారు. మీవద్ద ఈసమస్యకు సమాధానం వుంటే వుంటే మాకు తెలియజేయ గలరు. వాటిని తయారుచేసేందుకు అయ్యే ఖర్చులను కూడా మేమే భరించ గలము. మీ ఆలోచనలను వెంటనే మాతో పంచుకోండి. దీనికి పరిష్కారం చూపగలిగితే ఎంతోమంది పామాయిల్ రైతులకు ఊరట ఇచ్చినవారవుతారు. సరియైన పరిష్కారం చూపిన వారికి తగిన గుర్తింపు కూడా వస్తుంది.



- ఎడిటర్

# పలు రకాల పనులు చేసే ఒకే పరికరం

**రాష్ట్ర స్థాయి బహుమతి (సంయుక్తంగా)**

**పరికరం : గొడ్డలి, సుత్తి, బాడిశ, స్క్రూడ్రైవర్‌గా కూడా వాడగలిగే పనిముట్టు**

**ఇన్నోవేటర్ : మహమ్మద్ రఫిక్ అహెంగర్, అనంతనాగ్ జిల్లా, జమ్మూ & కాశ్మీర్.**



జమ్మూ కాశ్మీర్‌కు చెందిన 42 సంవత్సరాల మహమ్మద్ రఫిక్ అహంగర్ వృత్తిరీత్యా కమ్మరి పని చేస్తూవుంటాడు. ఇతను తాను పనిచేసే క్రమంలో ఎన్నో రకాల పనిముట్లు (పరికరాలు) కనుగొన్నాడు. అందులో ఒకదానిని గొడ్డలిగా, సుత్తిగా, చెక్కను చెక్కేటందుకు బాడిశగా, చెట్లను నరకటానికి, చివరికి స్క్రూడ్రైవర్‌గా కూడా వాడేందుకు అనువైన ఒక ప్రత్యేకమైన పరికరంగా రూపొందించాడు. కమ్మరి కుటుంబంలో పుట్టిన రఫిక్ బాల్యం ఆర్థిక ఇబ్బందుల వలన కష్టంగా సాగింది. ఇతని తండ్రికి ఇద్దరు కొడుకులు ఆరుగురు కుమార్తెలు. మా తల్లిదండ్రులు కష్టపడ్డారు, రేపు మా పిల్లలకు కష్టం తెలీకుండా



పెంచాలి అంటాడు రఫిక్. కమ్మరిపని చేసుకోవటానికి వీలుగా అన్నీ ఉండేవి. చిన్నప్పటినుంచీ రిపేర్లు చెయ్యటం, బొమ్మలు చెయ్యటం, నమూనాలు చెయ్యటం, చేసేవాడు. రఫిక్ కష్టపడి 10వ తరగతి చదివి తరవాత తండ్రికి సహాయంగా తండ్రి వర్క్‌షాప్‌లో చేరిపోయాడు.

1995వ సంవత్సరంలో తానే స్వతహాగా ఒక వర్క్‌షాప్ ప్రారంభించి గ్రిల్ గేట్లు, మోటారు రిపేర్లు చెయ్యసాగాడు. గ్రామంలో పుట్టి పెరిగాడు కనుక ఆ ప్రాంతపు ప్రజల అవసరాలు సమస్యలు సులువుగా గ్రహించి పరిష్కారాలు కనుగొనేవాడు. వాళ్ళ ప్రాంతంలో కరెంటు సరఫరా సరిగ్గా అందేది కాదు. తన పనులకి ఒక జనరేటర్ కావాలనుకొనేవాడు. కానీ కొనే ఆర్థిక స్థోమత లేదు. చివరికి ఎంతో శ్రమించి కాలితో ఆగకుండా నొక్కితే నడిచే ఒక చిన్న జనరేటర్ తయారు చేసుకున్నాడు.

40 వాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే ఈ జనరేటర్‌ని ఇతను ఇస్లామిక్ యూనివర్శిటీ ఆఫ్ సైన్స్ & టెక్నాలజీలో ప్రదర్శించాడు. ఆ సంస్థ ఎన్‌ఐఎఫ్‌కి ఒక ప్రాంతీయ కార్యాలయం. ఈ సంస్థతో 'గియాన్. జెకె. వారికి అవగాహన ఒప్పందం ఉండటంతో రఫిక్ ఎన్‌ఐఎఫ్ దృష్టిలో పడ్డాడు.

రఫిక్ కొత్త ఇన్నోవేషన్లు చెయ్యటంలో ఎక్కువ సమయం గడిపేవాడు. ఇతని భార్యకూడా ఎంతో ప్రోత్సహించేది. ఆమె కుటుంబ బాధ్యతలు, సమస్యలు ఇతని దృష్టికి రాకుండా చూసుకునేది. నేను కుటుంబం కోసం కష్టపడతాను, మావారు ఇతరుల సమస్యలు తీర్చటంలో కష్టపడతారు అంటుందామె.

**పరికరం ఆవిర్భావం :** రఫిక్ తన గ్రామంలోని వ్యక్తులు ఇంటిపనికి, వ్యవసాయానికి, వృత్తి పనికి (వడ్రంగి పని) వేరువేరు పనిముట్లు, పరికరాలు వాడటం గమనించాడు. అన్ని పరికరాలు తీసుకొని వెళ్ళటంలో వున్న కష్టం తీర్చటానికి అన్నింటికీ కలిపి ఒకే పరికరంలో వుంటే బావుంటుందని ఆలోచించి, అందరికీ అన్ని పనులకి ఉపయోగపడేవిధంగా దీనిని రూపొందించాడు.

**పరికరం :** రూ. 1,500/–ల ఖరీదు చేసే ఈ పరికరంతో ఇంట్లోకాని, చెక్కపని చేసే వడ్రంగి కానీ దీనిని చెట్లు నరకటానికి గొడ్డలిగాను, దడి కట్టడానికి సుత్తిగా, వడ్రంగి పనిలో చెక్కను చెక్కడానికి బాడిశగా, మేకులు దింపటానికి, సుత్తిగా, స్క్రూలు తిప్పటానికి స్క్రూడ్రైవర్‌గా కూడా దీనినే



ఉపయోగపడేలా రూపొందించాడు. ఇది ఎన్ఐఎఫ్ దృష్టికి వచ్చి దీని పేటెంటుకై దరఖాస్తు చెయ్యటం జరిగింది.

**ఇతర ఇన్నోవేషన్‌లు :** భూమి తవ్వి, మట్టి నమూనా తియ్యటానికి ఒక పరికరం, అనుకూలంగా – సులువుగా వుండే పార, అటోమేటిక్ జల్లెడ, అక్రోట్ కొయ్యటానికి పనికొచ్చే సేఫ్టీనెట్ (వల), ఇనుప రేకులు కత్తిరించటానికి ప్రత్యేకమైన కత్తెర మొదలైన ఎన్నో పరికరాలు రూపొందించాడు. ఇతను తన ఇన్నోవేషన్‌లను అనేకచోట్ల ప్రదర్శించి ప్రశంసలు, బహుమతులు పొందటం జరిగింది.

ఇన్నోవేషన్‌లు, వ్యాపారం కలిసి ఉంటే లాభమన్న ఆలోచనకు వీలుగా 2015లో ముస్తాక్ అహ్మద్ రూపొందించిన (వాల్‌నట్) అక్రోట్ కాయలు పగలగొట్టి, పప్పు వలిచే యంత్రాన్ని మెరుగుపరచి, ఉత్పత్తి చేసి, విక్రయించే హక్కులని పొందటం జరిగింది. వినియోగదారులకి సంతృప్తికరంగా దీనిని రూపొందించటానికి ఇంకా మార్పులు, చేర్పులు జరుగుతున్నాయి. మహమ్మద్ రఫీక్ అహంగర్ ఇన్నోవేషన్‌లు ఇంకా ఉత్సాహంగా చెయ్యటానికి వీలుగా ఎన్ఐఎఫ్ రఫిక్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీని ప్రారంభించే యోచనలో ఉంది.

**పరికరం కావాలనుకున్నవారు సంప్రదించండి :**
పల్లెసృజన, ఫోన్ : 040–27111959,
సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)

## పల్లెసృజన కార్యాలయంలో ఇన్నోవేషన్ల విస్తృత కేంద్రం

దేశవ్యాప్తంగా పునాదిస్థాయి ఇన్నోవేటర్లు (గ్రామీణ శాస్త్రవేత్తలు) తయారు చేసిన ఇన్నోవేషన్ల ప్రదర్శన 'పల్లెసృజన' కార్యాలయంలో ఏర్పాటు చేయడమైనది. ఈ ప్రదర్శనను పాఠశాల, ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, రైతులు సందర్శిస్తున్నారు. రైతులు ఈప్రదర్శనను చూస్తే వారికి అవసరమైన పనిముట్లను గుర్తించి వాటిని లాభకరంగా వినియోగించుకునే అవకాశం లభించటంతో పాటు, దేశీయ జ్ఞానానికి చేయూతను అందించిన వారవుతారు. మీ సమస్యలను పల్లెసృజనతో చర్చించవచ్చు.



సోలార్ సెల్ ఛార్జర్



వివిధ రకాల శుభ్రపరిచే సేంద్రియ ద్రావణాలు



యూరియా

శ్రీతైలం



సోలార్ స్ప్రేయర్



కరెంటు స్తంభాలనెక్కే చెప్పులు

హైదరాబాద్ వచ్చినపుడు 'పల్లెసృజన' కార్యాలయాన్ని తప్పక దర్శించండి.
ముందుగా మా కార్యాలయానికి సందేశాన్నిస్తే మీ సందర్శనను అర్థవంతంగా చేస్తాం.

'పల్లెసృజన' కార్యాలయం చిరునామా :
67, రోడ్ నెం. 2, వాయుపురి,
సైనిక్‌పురి పోస్టు, సికింద్రాబాద్ – 500 094.
ఫోన్ : 040–27111959,
సెల్ : 96528 01700.

అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎటిఐ) నిర్వహించిన ప్రేరణ-2018 లో

# గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ల ప్రదర్శన










హైదరాబాద్ శివం రోడ్‌లో గల కేంద్ర ప్రభుత్వ సంస్థ 'అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్' వారు 'తెకీస్ నెస్ట్' వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 'నేషనల్ లెవెల్ ఇన్నోవేషన్ సమ్మిట్ 'ప్రేరణ–2018" ప్రదర్శన ఏర్పాటులో 'పల్లెసృజన' పాల్గొనే అవకాశం లభించింది. సాంకేతిక విద్యనభ్యసించే విద్యార్థులు, అధికారులు ఈ ప్రదర్శనను ఎంతో ఉత్సాహంతో తిలకించారు. ప్రదర్శనలో మన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్ల ప్రదర్శనలు సందర్శకులందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇంతటి సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న తమకు రాని ఆలోచనలు, గ్రామాల్లో ఏమీ చదువుకోని వారికి రావటం, వారు చేసిన ఇన్నోవేషన్లను పరిశీలించి ఆనందానికి, ఆశ్చర్యానికి లోనయ్యారు.

ప్రదర్శన శాలలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో బ్రిగేడియర్ గణేశం గారు పాల్గొని 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'ను అందరూ గుర్తించే స్థాయికి ఎదగడం తమకెంతో సంతోషాన్ని ఇస్తోందని, ఈ ఇన్నోవేషన్లను అందరూ ఉపయోగించేలా చేయటానికి, తక్కువ వ్యయంలో, ఎక్కువ పనితనంతో పనిచే స్వదేశీ టెక్నాలజీని అందించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా వుందని, అందుకు సహృదయంతో అందరూ సహకరించాలని కోరారు. పునాది స్థాయి ఇన్నోవేటర్లు వారి ఆలోచన ప్రకారం సృజనలను ఆవిష్కరించారు కానీ, వాటికి ఇంకా మెరుగులు దిద్ది, ప్రజలను ఆకట్టుకునేలా, మన్నికగా, దృఢంగా వుండేలా చేయాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ విద్యార్థులపై కూడా వుందని అన్నారు.

ఎటిఐ సంస్థ డైరెక్టర్ 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన ఇన్నోవేషన్లను చూసి ఎంతో ముగ్ధులై ఇవి ప్రపంచానికి ఎంతో అవసరమని, ఇటువంటి ఆవిష్కరణలను వెలుగులోకి తెచ్చిన 'పల్లెసృజన' సంస్థను అభినందిస్తూ, ఇప్పటినుంచి ఇంజనీరింగ్ విభాగంలో జరిగే ప్రతి ప్రదర్శనలో గ్రాస్ రూట్ ఇన్నోవేషన్లను ప్రదర్శించాలని కోరారు.



# "పరిపూర్ణ రైతు" భూమేశ్వర్

తెలంగాణ రాష్ట్రంలోని జనగామ జిల్లా మెట్‌పల్లి మండలం, 'మెట్ల చిట్టాపూర్' గ్రామానికి చెందిన 45 సంవత్సరాల భూమేశ్వర్ 'పరిపూర్ణ రైతు' అని చెప్పవచ్చు. భూమేశ్వర్ తండ్రి జంగన్న, తల్లి బుచ్చమ్మ ఇతనికి ఇద్దరు కుమారులు. ఒక అబ్బాయిది డిగ్రీ పూర్తయింది, రెండో అబ్బాయి బి.టెక్. చదువుతున్నాడు. చిన్నప్పటినుంచే వ్యవసాయంపై మక్కువ పెంచుకోవటం వల్ల గ్రామ పాఠశాలలో 5వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నాడు. తన గ్రామంలో భూమేశ్వర్ ఇల్లు ఎక్కడ అంటే తెలియదు అంటారు కానీ 'అన్నదాత' ఇల్లు ఎక్కడ అంటే వెంటనే చూపిస్తారు! దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు ఇతను వ్యవసాయం ఎలా చేస్తున్నాడో, 'పరిపూర్ణ రైతు' అని 'పల్లెసృజన' ఎందుకు అంటుందో.

తన పూర్వీకుల ఆస్తి 5 ఎకరాలలో పూర్తిగా సేంద్రియ పద్ధతిలో పంటలను పండిస్తూ వుంటాడు. పొలంలో తను, తన భార్య ఎప్పుడూ ఏదో ఒక పని చేసుకుంటూనే వుంటారు. ఎప్పుడైనా పొలంలో కలుపు ఎక్కువైనపుడు, పంటల నూర్పిడి లాంటి ఎంతో అవసరమైతే తప్ప కూలీల ఖర్చు కూడా లేకుండా వ్యవసాయం చేసుకుంటూ వుంటారు. పొలాన్ని గట్లతో సహా ఎప్పుడూ శుభ్రంగా వుంచుకుంటాను కాబట్టి నా పంటలో కలుపు కూడా తక్కువే అంటాడు. ఎందుకంటే గట్లవెంట గడ్డి ఎక్కువగా వుంటే విత్తనోత్పత్తి జరిగి, అది ఎండినపుడు వాటి విత్తనాలు పొలంలోకి గాలి ద్వారా వెళ్ళటం ద్వారానే కలుపు ఎక్కువౌతుంది అంటాడు భువనేశ్వర్.

నేను నావ్యవసాయం కొరకు బయటినుండి కొనేది ఏదీ లేదు. విత్తనం మూడు నాలుగేళ్ళకోసారి కొంటాను. ఆ పంటలోనే మంచి విత్తనాలను సేకరించి తరువాతి సంవత్సరాల్లో ఉపయోగించుకుంటాను. నా ఆవుల ద్వారా వచ్చిన పేడను వర్మీ కంపోస్టుగా నేనే మార్చుకుంటాను, ఆవు మూత్రాన్ని ప్రతిరోజూ ఉదయం డబ్బాలలో పట్టుకోవటంతో నా దినచర్య మొదలవుతుంది. పొలంలో మూడుచోట్ల బోరు బావులను ఏర్పరచుకొని ఆ మూడింటిని పొలంలో ఒకచోట ఏర్పాటు చేసుకున్న 'ఫాం పాండ్' లోకి నీటిని తోడుకుంటాను. ఆ ఫాం పాండ్‌లోనే జీవామృతం కలిపి డ్రిప్పులు లేదా తడుల ద్వారా పంటలకు నేరుగా అందిస్తాను. నా పంటలకు చాలావరకు వరకు ఎటువంటి పురుగు ఆశించదు. ఒకవేళ



ఆశించినా ఒకటి లేదా రెండుసార్లు బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం లాంటివి పిచికారి చేస్తాను. ఎటువంటి రసాయన సంబంధ ఎరువులు కాని, పురుగు మందులు కాని పిచికారి చేయను. ఎప్పుడైనా కలుపు తీయటానికి, నూర్పిడి చేయటానికి తప్ప పొలంలోకి మనిషి దిగే పనే లేదు అంటాడు భూమేశ్వర్.

వరి, కంది, అలసంద, పెసర లాంటి పంటలు పండిస్తాడు. ఒకటి లేదా అర ఎకరంలో కూరగాయలు పండిస్తాడు. ఆ కూరగాయలపై వచ్చే ఆదాయాన్నే తన పొలం ఖర్చులకు వినియోగించుకుంటాడు. పొలం గట్లవెంట కర్రలు పాతి కాకర, బీర లాంటి తీగజాతి కూరగాయలు పండిస్తాడు. తన కూరగాయలను తానే స్వయంగా మెట్‌పల్లి మార్కెట్‌లో అమ్ముకుంటాడు. కొత్తిమీర తప్పనిసరిగా సాగు చేస్తాడు. ఉదయం ఆరు గంటల లోపల కొత్తిమీర కోసి మార్కెట్‌కు వెళ్ళి అమ్ముకుని వచ్చి మళ్ళీ పది గంటలకు పొలంలో వుంటాడు భూమేశ్వర్.

45 సంవత్సరాల వయసు వచ్చినా, అతన్ని చూస్తే 25 సంవత్సరాల యువకుడిలా కనబడతాడు. నీ ఆరోగ్య రహస్యం ఏమిటంటే, నేను పండించే పంటనే ఆహారంగా తీసుకుంటాను, పదిమందికి ఆరోగ్యకరమైన ఆహార ధాన్యాలను అందిస్తాను అంటాడు. ఫాం పాండు గట్టునే రెండు డ్రమ్ములను ఏర్పాటు చేసుకున్నాడు. వాటిలో పెద్ద (200 లీ.) నీటి డ్రమ్ములో జీవామృతం కలిపి, ఫాంపాండ్ లోని నీటితో పాటు పొలానికి వెళ్ళే ఏర్పాటు చేసుకున్నాడు. చిన్న (50 లీ.) డ్రమ్ములో జీవామృతం పోసి, అది వడగట్టబడేలా ఏర్పాటు చేసుకున్నాడు. ఆ నీటిని అవసరమైనపుడు పంటపై పిచికారి చేస్తాడు.

తన పొలంలో పురుగులు పడ్డాయా లేదా అని తెలుసుకోవటానికి ఎకరానికి 20 చొప్పున పంగల కర్రలను పాతుతాడు. పంటపై పురుగులు ఆశించినట్లయితే వాటిని తినటానికి పక్షులు వస్తాయి, అవి ఆ కర్రలపై వుండి, పంటపైన పురుగులను గమనించి ఏరుకుని తింటుంటాయి. పక్షులు ఎక్కువగా వాలుతుంటే పంటపై పురుగు ఆశించిందని గుర్తిస్తాడు. అప్పుడు తగిన చర్యలు తీసుకుంటాడు. కానీ, వీలైనంత వరకు ఆ పురుగులను పక్షులే తినేస్తాయి అంటాడితను. పంట పొలంలో పక్షి స్థావరాలు ఏర్పాటు చేస్తే సగం పురుగుల బెడద తగ్గుతుంది అంటాడు. అదే కర్రలకు క్రింద ఒక ప్లాస్టిక్ సెలైన్ బాటల్‌కు గ్రీసు పూసి కర్రకు కడతాడు. ఒకవేళ పంటపై దోమ ఆశించిందంటే సాయంత్రం, ఉదయం వేళల్లో ఆ దోమ ఈ బాటిల్‌కున్న గ్రీసుకు అంటుకుంటుంది. దాన్ని బట్టి దోమ నివారణ చర్యలు చేపడతాడు. అంతేకాని, పురుగు వున్నా, లేకున్నా పంటపై అనవసరంగా మందును పిచికారి చేయడు. ఈ సేంద్రియ పద్ధతిలో దోమ నివారణ, పురుగుల నియంత్రణ జరుగుతుందా అని అడిగితే, దాదాపు నశిస్తుంది, ఒకవేళ ఒక పదిశాతం మిగిలిందనుకోండి పంటను తింటే తినని, అవి తినగా మిలిగిందే మన ప్రాప్తం, ప్రకృతి ధర్మాన్ని మనమెలా శాశించగలం అంటాడు. తన ఇంట్లో ఆహారానికి అవసరమైన అన్ని పంటలను పండిస్తాడు. వాటినే వినియోగించుకుంటాడు. నువ్వులు కూడా పొలం గట్లవెంట వేసి, వాటిని తానే గానుగలో నూనె పట్టించుకుని ఆ నూనెనే ఉపయోగిస్తాడు.

ఇక దిగుబడి విషయానికి వస్తే తన వరి దిగుబడి ఎకరాకు 25 క్వింటాళ్ళు వుంటుంది, ఏమాత్రం పెట్టుబడి ఖర్చు లేదు కాబట్టి నాకు ఆ దిగుబడి చాలు అంటాడు. తన ధాన్యాన్ని కూడా నేరుగా మార్కెట్‌కు తరలించడు. దాన్ని బియ్యం పట్టించి క్వింటాలు రూ. 6,000/- చొప్పున





అమ్ముకుంటాడు. ఇతని బియ్యానికి ఈ ప్రాంతంలో మంచి గిరాకీ వుంది. ఎందుకంటే భూమేష్‌ది స్వచ్ఛమైన సేంద్రియ విధానం అని నమ్మకం ఏర్పడిపోయింది. కాబట్టి తన బియ్యం పట్టించిన వెంటనే అమ్ముడు పోతుంది అంటాడు.

తన పొలంలో బోరు బావులు వేయించక ముందు, డ్రిప్పు లేనపుడు నీటియెద్దడికి ఒక వినూత్న పద్ధతిని పాటించి పంటలను కాపాడుకున్నాడు. ఒకసారి సమీప పట్టణమైన మెట్‌పల్లి ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో 'సెలైన్' బాటిళ్ళను చెత్తబుట్టలో పడి వుండటం గమనించి, వాటిని సేకరించుకుని వచ్చి ప్రతి కూరగాయ చెట్టుకు ఒక కర్రను పాతి, దానికి సెలైన్ బాటిల్ అమర్చి వాటిలో ఉదయం సాయంత్రం నీరు పోసేవాడు. ఆ సెలైన్ బాటిల్ పైపు ద్వారా మొక్కలకు చుక్క చుక్క నీరు పడేలా చేసి తన పంటను కాపాడుకున్నాడు. ప్రతి చెట్టుకు రోజుకు ఒక లీటరు నీరు అందించేవాడు. దిగుబడి కూడా చాలా బాగా వచ్చిందట. ఈ పనంతా చేయటం కష్టం కదా అని అడిగితే 'నాకు ఏ పనీ పాటా లేకుండా ఊరికే ఉండటం అంటే ఇష్టం వుండదు. రైతన్నవాడు కష్టపడాలి' అంటాడు. ఎంత కష్టపడితే అంత ఫలితం ఖచ్చితంగా వుంటుంది అంటాడు. 2000 సంవత్సరంలో బోరు బావులు వేయటంతో తన కష్టం కొద్దిగా తగ్గింది. నాలుగు సంవత్సరాల క్రితం ఒక ట్రాక్టరు కొన్నాడు.

తన ఆవుల పేడనే తన పొలానికి ఉపయోగిస్తాడు, వాటికి పుట్టిన కోడె దూడలను అమ్ముకుంటాడు, ఆవు దూడలను అలాగే పెంచుకుంటాడు. తన స్థలంలోనే 'వర్మీకంపోస్టు' తొట్లను ఏర్పాటు చేసుకుని తానే స్వయంగా తయారు చేసుకుంటాడు. వర్మీ కంపోస్టు తొట్లలో వేసిన నీరు కూడా వృధా పోకుండా ఆ నీరు ఒక తొట్టిలోకి వచ్చే ఏర్పాటు చేసి, ఆ నీటిని (వర్మీ వాష్) కూడా పంటపై పిచికారి చేసుకుంటాడు. గతంలో పంట దిగుబడిపై లక్ష రూపాయల ఆదాయం వస్తే, 50 వేల దాకా ఎరువులు, పురుగు మందులకు ఖర్చయ్యేది. ఇప్పుడు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా, 75 వేల దాకా ఆదాయం వస్తుంది అంటాడు భూమేష్. ట్రాక్టర్ తనదే, ఎరువు తనదే, వర్మీ కంపోస్టు తనదే. వర్మీ తీసినప్పుడల్లా మూడు నెల్లకోసారి 50 బస్తాలు వస్తుంది. తన ఎరువును ఎవ్వరికీ అమ్మడు, మొత్తం తన పొలానికే వినియోగిస్తాడు. ఈ సంవత్సరం తన గ్రామంలోని ప్రతి పొలాన్ని దోమపోటు ఆశించింది కాని తన పొలానికి మాత్రం దోమ బెడద లేదు. ప్రాంతీయ వ్యవసాయాధికారులు కూడా వచ్చి చూసి తనను మెచ్చుకున్నారు అన్నాడు.

పసుపును కూడా నర్సరీ పద్ధతిలో మొలక ఎత్తించి పొలంలో నాటుతాడు. ఎకరాకు 90 కడాయిల దిగుబడి వస్తుంది అంటాడు. దాన్ని తన పొలంలోనే పసుపు వండి అమ్ముకుంటాడు. పల్లెసృజన అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం భూమేష్‌కు సలహా ఇస్తూ "ఈ పద్ధతిని ఇప్పటినుంచి పాటించకుండా పచ్చి పసుపును అలాగే నీడలో ఎండబెట్టి, తర్వాత దాన్ని ముక్కలుగా తరిగించి, మళ్ళీ నీడలో ఎండబెట్టి, పూర్తిగా ఎండిన తర్వాత పసుపుగా తయారు చేయమన్నాడు. మణిపూర్, మధ్య ప్రదేశ్ ప్రాంతాల్లోని రైతులు ఇలాగే చేస్తారని, దానివల్ల రైతుకు ఎంతో వ్యయ, ప్రయాసలు తగ్గటమే కాక, పసుపు కూడా చాలా స్వచ్ఛంగా వుంటుంది" అని చెప్పగా అతను ఇప్పటినుంచి ఈ పద్ధతిని తప్పక పాటిస్తాను అన్నాడు.

సాధించిన మంచి దిగుబడులను గుర్తించిన అప్పటి సమైక్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా 'ఉత్తమ రైతు' పురస్కారం కూడా అందుకున్నాడు భూమేశ్వర్. ఇతని సమగ్ర వ్యవసాయ పద్ధతులు ప్రతి రైతు ఆచరించి, పాటించ వలసినవి. ఒక రైతు ఏయే పనులు చేయాలి, చేసి ఏమి సాధించవచ్చు అని నిరూపించిన ఆదర్శ రైతు భూమేష్‌ను 'పరిపూర్ణ రైతు' అనటంలో పొరపాటేమీ లేదు. దానికి అతను అర్హుడు కూడా. కష్టపడటంలోనే ఆనందం వుందన్న మంచి భావనతో వ్యవసాయం చేస్తున్న భూమేశ్వర్‌ను 'పల్లెసృజన' మనసారా అభినందించింది. రైతులందరూ ఆయనలా పరిపూర్ణ రైతులుగా మారితే మనదేశం సస్య శ్యామలం అవుతుంది. ప్రజలు, పశువుల ఆరోగ్యం వృద్ధి చెంది రైతు కూడా 'అన్నదాత' పేరును సార్థకం చేసుకుంటాడు.

**భూమేశ్వర్ ఫోన్ : 9182370257**

# విజయవాడలో పల్లెసృజన ద్వారా 'ఇన్నోవేషన్ల విస్తృతి కేంద్రం' ప్రారంభం




సమైక్య ఆంధ్రప్రదేశ్ రెండుగా విడిపోవటం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా 'అమరావతి' ఏర్పాటు కావటంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు హైదరాబాద్‌కు రావటం తగ్గిపోయింది. దీనివల్ల సికింద్రాబాద్ లోని ఇన్నోవేషన్ల విస్తృతి కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు సందర్శించటం మెల్లమెల్లగా తగ్గిపోవటం 'పల్లెసృజన' గమనించింది. ప్రజలు, అధికారులు, కళాశాలలు సులభంగా సంపర్కం చేయటానికి ఇన్నోవేషన్లను చూడటానికి అనుకూలంగా ఉండేట్టుగా అభిమానులు, ఇన్నోవేటర్ల కోరిక మేరకు అంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 'పల్లెసృజన' తరుపున 2018 మే 29న విజయవాడలో 'ప్రగతి ప్రింటర్స్' ప్రాంగణంలో ఆత్మీయుల మధ్య సంతోషంగా 'ఇన్నోవేషన్ల విస్తృతి కేంద్రం' (ఇన్నోవేషన్ డిఫ్యూజన్ సెంటర్–ఐడిసి)ను ఏర్పాటు చేయడమైనది.

విజయవాడ శాఖ 'ఇన్నోవేషన్ల విస్తృతి కేంద్రం' పర్యవేక్షణను మన ఇన్నోవేటర్, రాష్ట్రపతి పురస్కార గ్రహీత యు. ఏడుకొండలు పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించబడతాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు, ఇన్నోవేటర్లు, అభిమానులు తమ అభిప్రాయాలు, అనుభవాలు, నూతన ఇన్నోవేషన్లకు సంబంధించిన సమాచారాన్ని ఏడుకొండలు, ఫోన్ నెం. 94941 31797 పై సంప్రదించవలసిందిగా 'పల్లెసృజన' వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు తెలియజేశారు.

ఈ సందర్భంగా గణేశం గారు మాట్లాడుతూ "ఆంధ్రప్రదేశ్ లో 'ఇన్నోవేషన్ల విస్తృతి కేంద్రం' ప్రారంభానికి సహకరించిన విజయవాడ పుర ప్రముఖులు, 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్'కు, ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేటర్లకు పల్లెసృజన తరుపున ధన్యవాదాలు తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కడైనా సరే రైతులకు సంబంధించిన ప్రదర్శనలు నిర్వహించే వారు ఈ కార్యలయాన్ని సందర్శిస్తే 'పల్లెసృజన' మీ ప్రదర్శనలో గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లను ప్రదర్శిస్తుంది. అలాంటి ప్రదర్శనల ద్వారా తక్కువ ఖర్చుతో రైతుల కొరకు రైతులు తయారు చేసిన ఇన్నోవేషన్లు అందరికీ అందుబాటులోకి వస్తాయి.

**'ఇన్నోవేషన్ల విస్తృతి కేంద్రం' విజయవాడ చిరునామా :**

ఐ.డి.సి. ' పల్లెసృజన,
ప్రగతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాంగణం,
40–5–6/2, టికిల్ రోడ్,
బృందావన్ కాలనీ, విజయవాడ – 520 007.
నిర్వహణ :
ఏడుకొండలు, ఫోన్ : 94941 31797

అవార్డులు

# జీవ వైవిధ్యంలో విశేష కృషి సల్పిన 'విత్తనాల రమేష్'కు 'కృషి సమ్మాన్' పురస్కారం







బండారు రమేష్ గుంత కోడూరు గ్రామం, తాండూరు జిల్లా, మహబూబ్ నగర్ జిల్లా వాస్తవ్యుడు మల్లయ్య గారి ప్రథమ సంతానం. ఇతనికి ఒక తమ్ముడు, ఒక చెల్లి ఉన్నారు. తల్లి వ్యవసాయ కూలి. ఇతను ఒక నిరుపేద కుటుంబంలో పుట్టి, చదువుపై ఆసక్తితో తన కుటుంబంలోనే చదువుకున్న మొదటి వ్యక్తిగా నిలిచాడు. తన ఇంటర్ పరీక్షల్లో బై.పి.సి.లో 87.6 శాతం మార్కులు తెచ్చుకున్నాడు. తను చదివిన ప్రభుత్వ జూనియర్ కళాశాల యాజమాన్యం మన్ననలు పొందాడు.

రమేష్‌కు విత్తనాల సేకరణకు పురికొల్పినది 2013వ సంవత్సరంలో హైదరాబాద్‌లో జరిగిన అంతర్జాతీయ జీవ వైవిధ్య సమావేశం. రమేష్ తన జిజ్ఞాసను విత్తనాలు, వివిధ మొక్కలు, వాటి విశిష్ఠతపై కేంద్రీకరించి నాటినుండి నేటివరకు 477 రకాల విత్తనాలను సేకరించేలా చేసింది. తాను సేకరించిన విత్తనాల వివరాలను, వాటి విశిష్ఠతను, గుణగణాలను శాస్త్రీయ నామాలను నమోదు చేసుకున్నాడు. తాను సముపార్జించిన జ్ఞానాన్ని అందరికీ తెలియజేయాలని నిశ్చయించుకున్నాడు.

ఇంత చిన్న వయసులోనే తను సాధించిన ఘనతకు గుర్తింపుగా రాష్ట్ర గవర్నర్ శ్రీ నరసింహన్, తెలంగాణ రాష్ట్ర అటవీశాఖామాత్యులు జోగు రామన్న, బిర్లా సైన్స్ మ్యూజియంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం నాడు ప్రదర్శించి పెద్దల మన్ననలు పొందాడు. 'కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్' హైదరాబాద్ వారు 2017లో గ్రీన్ స్టూడెంట్ అవార్డుని రమేష్ బహూకరించారు. అదే సంవత్సరం (2017)లో అహమ్మదాబాద్‌లో జరిగిన 'సాత్విక్ ఫుడ్ ఫెస్టివల్'లో తన విత్తనాలను ప్రదర్శించి, శ్రీ అనిల్ గుప్తా, శ్రీ మషేల్కర్ గార్ల మన్ననలు పొందాడు.

ఈ యువకుడు తనకు తానుగా చేసిన యీ మహత్తర కృషికై 'పల్లెసృజన' అతని పేరును '2018 సృష్టి సమ్మాన్' పురస్కారానికై ప్రతిపాదించింది. మారుమూల స్థాయి ఆవిష్కర్తలు, జ్ఞాన సంపన్నులను గౌరవించే ముఖ్యంగా జీవ వైవిధ్యాన్ని కాపాడే దిశగా పని చేస్తున్న వ్యక్తులను, సంస్థలను 'సృష్టి సమ్మాన్' పురస్కారంతో సన్మానించడం 'సృష్టి' సంస్థ గత పది సంవత్సరాలుగా సత్కరిస్తోంది. ఈ సంవత్సరం (2018) 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చిన యువ ఇన్నోవేటర్ "బండారి రమేష్" (విత్తనాల రమేష్ శీర్షికన గతంలో వ్యాసం ప్రచురితమైంది)ను 'సృష్టి సమ్మాన్' పురస్కారంతో సత్కరించడం జరిగింది.

# ఇన్నోవేటర్ నన్నెం తిరుపతికి రాష్ట్రపతి సమక్షంలో "నేషనల్ సోసైటల్ ఇన్నోవేషన్ అవార్డ్-2017" పురస్కారం





మండలం, కొత్తపేట పంచాయితీ వడ్డసంఘం గ్రామానికి చెందిన మన ఇన్నోవేటర్ నన్నెం తిరుపతి రావు రూపొందించిన 'కరెంటు స్తంభాలను ఎక్కేందుకు చెప్పులు' జాతీయ స్థాయిలో గుర్తింపుకు నోచుకుంది. 'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ సామాన్య విద్యుత్ కార్మికుడు తన తోటి కార్మికుల క్షేమం కోసం తయారు చేసిన ఈ పరికరంతో జాతీయ పరిశోధనా అభివృద్ధి సంస్థ ప్రకటించే జాతీయ స్థాయి అవార్డుకు ఎంపికైంది. 20వ సాంకేతిక దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ పరిశోధనా అభివృద్ధి కార్పోరేషన్ ఇన్నోవేటర్లకు అవార్డులు ప్రకటించింది. ఈ అవార్డు క్రింద ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో రూ. 3 లక్షల నగదుతో పాటు భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సమక్షంలో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ చేతుల మీదుగా ఎన్.ఆర్.డి.సి. వారి "నేషనల్ సోసైటల్ ఇన్నోవేషన్ అవార్డ్–2017" పురస్కారం అందుకొన్నాడు. నన్నెం తిరుపతి రూపొందించిన పరికరం ఎంతోమంది విద్యుత్ కార్మికులు నిర్భయంగా ప్రాణహాని లేకుండా తమ పనులు సునాయాసంగా చేసుకుంటున్నారు. ఇప్పటికే దేశంలోని ఎన్నో రాష్ట్రాలకు, ప్రభుత్వ విద్యుత్ సంస్థలకు సరఫరా చేస్తున్నాడు. తిరుపతికి దక్కిన ఈ పురస్కారంతో తన తోటి కార్మికులకు ఇంకా ఎంతో సహాయ పడగలిగే అవకాశం వచ్చిందని తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. సాధారణ కూలీనైన నన్ను జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకు వచ్చిన 'పల్లెసృజన' చేసిన మేలు నేనెప్పటికీ మర్చిపోలేను అన్నాడు. ఇంతవరకు ఆంధ్రప్రదేశ్‌లో ఇన్నోవేషన్‌కు గుర్తింపు పొందిన మొదటి వ్యక్తి నన్నెం తిరుపతి.

ఇంతటి ఘనత సాధించిన ఇన్నోవేటర్‌కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ శాఖ అధికారులు ఎంతో సంతోషించి ఈ పరికరాన్ని ప్రతి గ్రామంలోని విద్యుత్ లైన్‌మెన్‌లకు అందేలా ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వటంతో పాటు కొన్ని ప్రాంతాలకు సరఫరా చేసేందుకు ఉత్తర్వు కూడా ఇచ్చారు. 'పల్లెసృజన వెలుగులోకి తీసుకు వచ్చిన ఇన్నోవేటర్లలో అత్యధికంగా తన ఇన్నోవేషన్ ద్వారా అత్యధిక వ్యాపారం చేస్తున్న వారిలో ఒకరిగా పేరు సంపాదించుకున్న తిరుపతిని 'పల్లెసృజన' అభినందిస్తోంది.



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి
రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## బియ్యం నుండి తవుడు, నూకలు వేరు చేసే యంత్రం

**సమస్య - పరిష్కారం :**

బియ్యం నుండి నూకను, మెరికను వేరు చేయడం అన్నది కొన్ని శతాబ్దాలుగా చేతులతో చేస్తూ వచ్చారు. ఈ ప్రక్రియ జరిగినప్పుడే రాళ్ళు, ఊక, తవుడును కూడా వేరు చెయ్యాల్సి వుంటుంది. తవుడు పొట్టు గాలికి ఎత్తి తియ్యగా గింజలు చేతితో తియ్యాల్సి వుంటుంది. ఇది చాలా శ్రమతో కూడుకున్న పని. చాలా సమయం కూడా పడుతుంది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మోహన్ శర్మ ఈ పనులన్నీ సులువుగా చెయ్యటానికి ఒక యంత్రం రూపొందించాడు. గాలి కొట్టుడు సూత్రంపై పనిచేసే ఈ యంత్రం సహాయంతో తవుడు, పొట్టు, మంచి బియ్యం, నూకలు, గరిక (పొట్టు ఊడని గింజలు) అన్ని వేరు చెయ్యవచ్చు.

**పరికరం :**

ఈ యంత్రాన్ని మోహన్ శర్మ చెక్కతో తయారు చేశాడు.



పిండిమరకు ఉన్నట్లు ఉండే భాగంలోనుంచి బియ్యం పొయ్యాల్సి వుంటుంది. దీని క్రింద ఉండే ఫ్యాను కారణంగా బియ్యంలోని మంచి బియ్యం, నూకలు, గరిక గింజలు విడిపోయి వేరువేరు సైజులలో వున్న కన్నాల ద్వారా విడివిడిగా బైటకు వస్తాయి. ఇది బరువు ఆధారంగా వేరుచేసే పద్ధతిపై పని చేస్తుంది. రాళ్ళు ఎక్కువ బరువు కనుక అవి ముందు వస్తాయి. తరువాత బియ్యం గింజలు ఒక జల్లెడపై పడి నూక, మంచి బియ్యంగా విడిపోతాయి. ఊక, తవుడు దూరంగా వెదజల్లబడతాయి. దానికి కొంత ముందు గరిక గింజలు పడతాయి.

**సాంకేతిక వివరాలు :**

- ఈ యంత్రం 42 అంగుళాల పొడవు, 16 అంగుళాల వెడల్పు, 47 అంగుళాల ఎత్తు వుంటుంది.
- 22 అంగుళాళ ఫ్యాను ఉంటుంది.
- ఈ యంత్రం ద్వారా గంటకు 40 కిలోల బియ్యం సేకరించవచ్చు.

**ముఖ్యాంశాలు :**

- ఈ యంత్రం చాలా సులభంగా, త్వరగా మంచి బియ్యం, నూకలు, గరిక గింజలు, తవుడు, ఊకను వేరు చేస్తుంది.

**పురస్కారాలు :**

- ఎన్.ఐ.ఎఫ్. 2013లో తమ 7వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో మోహన్ హర్మని ప్రోత్సాహక బహుమతితో సత్కరించింది.

**కావాలనుకున్నవారు సంప్రదించండి :**

పల్లెసృజన, ఫోన్ : 040-27111959,
సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)

# నిర్వహణా ఖర్చులు లేని 'సోలార్ సెల్‌ఫోన్ ఛార్జర్'

వరంగల్ లోని 'గిర్నిబావి' ప్రాంతానికి చెందిన 'ముప్పారపు రాజు' రూపొందించిన 'ఎటువంటి నిర్వహణా ఖర్చులు లేని సెల్‌ఫోన్ ఛార్జర్' ఎంతోమంది ప్రముఖుల అభిమానాన్ని చూరగొంది. ముప్పారపు రాజు ఈ సెల్‌ఫోన్ ఛార్జర్ గురించి వరంగల్ రూరల్ కలెక్టర్ ఎం. హరితకు వివరించగా ఆమె వెంటనే కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేయమని పురమాయించడం జరిగింది. అక్కడ ఏర్పాటు చేసిన పరికరాన్ని కలెక్టర్ స్వయంగా ప్రారంభించింది. దాని పనితీరును గమనించిన కలెక్టర్ సామాజిక మీడియా 'ట్విటర్' ద్వారా తన ఆనందాన్ని వ్యక్తం చేయటం కూడా జరిగింది. దాన్ని చూసి ఎటువంటి నిర్వహణా ఖర్చులు లేకుండా ప్రజల సౌకర్యార్థం ఇటువంటివి చాలా అవసరమని గ్రహించిన ఆ జిల్లా అటవీశాఖ డిఎఫ్ఓ జిల్లాలోని 'పాకాల చెరువు'ను సందర్శించే సందర్శకుల సౌకర్యార్థం అక్కడ ఫారెస్ట్ గెస్ట్‌హౌస్ ఎదురుగా ఏర్పాటు చేయించారు. ఈ రెండూ విజయవంతంగా పని చేస్తుండటంతో వరంగల్ నగరంలోని 'గిర్నిబావి' నాలుగు రోడ్ల కూడలిలో నగర ప్రజల ప్రయోజనార్థం అర్‌డిఓ ఏర్పాటు చేయించింది. ఈ మూడింటిని ఏర్పాటు చేయటం వల్ల ఆయా ప్రాంతాలలోని ప్రజలు ఇది ఎంతో సౌకర్యంగా వుందని ఏర్పాటు చేసిన వారిని అభినందించారు.

ముప్పారపు రాజు ఏర్పాటు చేసిన ఈ సెల్‌ఫోన్ ఛార్జర్ పగటి పూట కరెంటు, బ్యాటరీ, ఇతర ఎటువంటి నిర్వహణా ఖర్చులు లేకుండా సూర్యరశ్మి సహాయంతో పని చేస్తుంది. ఒక స్తంభానికి 'సోలార్ ప్యానల్'ను ఏర్పాటు చేసి, దాని నుండి వెలువడే విద్యుత్తు నేరుగా ఒక వైరు ద్వారా క్రింద అందుబాటులో ఏర్పాటు చేసిన సెల్ ఫోన్ ఛార్జింగ్ వైర్ల ద్వారా తమ ఫోన్లను ఛార్జింగ్ చేసుకునే ఏర్పాటు చేశాడు. ఒకేసారి ఆరు ఫోన్లు ఛార్జింగ్ పెట్టుకోవచ్చు.

ప్రస్తుతం సమాజంలో 'సెల్‌ఫోన్' అందరికీ అత్యవసరమైన వస్తువుగా మారిన విషయం తెలిసిందే. మారిన సాంకేతికత దృష్ట్యా ఆ సెల్‌ఫోన్‌లు ఎక్కువసేపు ఛార్జింగ్‌ను పొందుపరచుకోలేక ఎంతోమంది ఇబ్బంది పడుతున్నారు. ఇంటర్‌నెట్‌ను వినియోగించుకునే వారికి ఈ పరిస్థితి ఇంకా ఇబ్బందికరంగా మారటంతో చాలామంది తమ ఫోన్‌తో పాటు 'పవర్ బ్యాంక్'ను కూడా జేబులో పెట్టుకుని తిరుగుతున్నారు. వీటిని ఏర్పాటు చేసుకోలేని వారు, ముఖ్యంగా గ్రామీణులు




తమ ఫోన్లలో ఛార్జింగ్ అయిపోవటంతో ఫోన్‌లు ఆగిపోవటం వల్ల అత్యవసరంగా మాట్లాడాలనుకున్నపుడు ఎంతో ఇబ్బందికి గురవుతున్నారు.

ఎక్కువ మంది సందర్శకులు వుండే చోట ఇటువంటి ఛార్జర్లు ఏర్పాటు చేయించటం ద్వారా ఎటువంటి నిర్వహణా అవసరం లేకుండా ప్రజలు దీన్ని ఉపయోగించుకునే వీలుంటుంది.

ఇలాంటి ఉచిత సోలార్ సెల్‌ఫోన్ ఛార్జర్లను మీ ప్రాంతాలలో ఏర్పాటు చేయాలనుకున్న వారు ఇన్నోవేటర్ ముప్పారపు రాజును సంప్రదించండి.

**ముప్పారపు రాజు ఫోన్ : 95028 55858**



**గతసంచికలో ప్రచురించిన**

**నన్నం తిరుపతి**

**'కరెంటు స్తంభాలనెక్కే చెప్పులు'**

కథనంలో ఇన్నోవేటర్ ఫోన్ నెంబరు పొరపాటున తప్పుగా ముద్రించబడింది. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాము.

కరెంటు స్తంభాలనెక్కే చెప్పులు కావాలనుకున్నవారు సంప్రదించవలసిన ఫోన్ నెం. :

**91336 11364**

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

National Innovation Foundation-India



ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

## జాతీయ 11 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**

**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 11వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును.** జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును. అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. 10,000లను వివిధ వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2019** లోగా మాకు చేరేలా పంపండి.

SRISTI HONEY BEE NETWORK GIAN

మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :

**National Innovation Foundation,**
C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.
Phone: (02764) 261131/32/ 38/ 39, Fax: (079) 26731903, Email: campaign@nifindia.org, Website: www.nif.org.in

సూచన : వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై http://www.nif.org.in/announcement సంప్రదించండి. లేదా 'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : 040-27111959) సంప్రదించండి.



# స్వల్ప ఖర్చుతో వ్యవసాయం ఖచ్చితంగా సాధ్యమే - మునిరత్నం నాయుడు

**ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని రైతాంగం సేంద్రియ వ్యవసాయం వైపుకు దృష్టిని మళ్ళించడ ఎంతో శుభ పరిణామం. 'పల్లెసృజన' జనవరి-ఫిబ్రవరి 2014 (నాలుగు సంవత్సరాలకు ముందే) సంచికలో సేంద్రియ వ్యవసాయం చేయాలనుకున్న రైతాంగానికి 'మునిరత్నం నాయుడు' గారు ఇచ్చిన సలహాలను ప్రచురించడమైనది. ఈ సంవత్సరం నుంచి సేంద్రియ వ్యవసాయం ఇంకా వృద్ధి చెందుతుందన్న విశ్వాసంతో రైతాంగానికి తమ పొలాలను సేంద్రియం వైపుకు తయారు చేయటానికి అనువైన సలహాలను ఇక్కడ పునర్ముద్రిస్తున్నాము. పాఠకులు నిశితంగా చదివి పాటిస్తారని ఆశిస్తున్నాము.**

**- ఎడిటర్**

ప్రకృతి మనకి ప్రసాదించిన అన్ని వనరులకి మూలం 'భూమే'. కానీ ఒక విధంగా చెప్పాలంటే వ్యవసాయంలో దానిని కర్కశంగా వాడుకుంటున్నాం. దీని కారణంగా అది తన సారాన్ని శాశ్వతంగా కోల్పోయే ప్రమాద దశకు చేరుకుంటోంది. అదే జరిగితే మనందరికి తిండి దొరకని పరిస్థితి వచ్చే ప్రమాదం పొంచివుంది. కనుక ఈ దశలోనే వ్యవసాయం చేస్తూ దాని వాసి తగ్గకుండా కాపాడుకోవటం మన కనీస ధర్మం.

మన వ్యవసాయ విధానాలను మార్చుకుని 'జీరో బడ్జెట్ వ్యవసాయం' గురించి చెప్పేందుకు పత్రికలు, వ్యవసాయాధికారులు, అనేక స్వచ్ఛంద సంస్థలు విశేషంగా ప్రాచుర్యం కల్పించే ప్రయత్నం చేస్తున్నాయి. రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వినియోగించేలా ఆ ఎరువుల తయారీ పరిశ్రమలు చేసిన వ్యాపార ప్రకటనలను నమ్మి మోసపోయిన రైతు తమ పొలాలను నిర్వీర్యం చేయటంతో పాటు, వాతావరణ కాలుష్యాన్ని తారాస్థాయికి తీసుకు వెళ్ళటంలో తనకు తెలియకుండానే రైతు కారణభూతుడు అవుతున్నాడు. అంతేకాక నేడు మనుషుల ఆరోగ్య పరిస్థితి ఇంత దయనీయ స్థితికి చేరటానికి కారణం కూడా ప్రధానంగా ఈ రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులే అన్నది నిర్వివాదాంశం.

ఇటువంటి పరిస్థితి నుంచి సమాజానికి మేలు చేయటంతో పాటు, రైతు ఇంకా అప్పుల ఊబిలో కూరుకు పోకుండా, ఇతరులపై ఆధార పడకుండా స్వయం సమృద్ధి



సాధించేందుకు తనదైన శైలిలో శ్రమించి ఎందరో రైతులకు ఆదర్శప్రాయుడు అయ్యాడు చిత్తూరు జిల్లాకు చెందిన 'మునిరత్నం నాయుడు'.

ఈయన గురించి చెప్పాలంటే చిత్తూరు జిల్లా, వేములవాడ మండలం, కస్తూరి కండ్రిగ గ్రామానికి చెందిన పాలడుగు లక్ష్మీ నారాయణ, గుర్రమ్మల ముగ్గురు సంతానంలో ప్రథముడు పాలడుగు మునిరత్నం నాయుడు. 68 సంవత్సరాల మునిరత్నం నాయుడుకు 1975లో కుసుమ కుమారితో వివాహం జరిగింది. ఇద్దరు మగబిడ్డలు. మొదటివాడు పి. లోకేష్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడగా, రెండవ వాడు మహేష్ అమరావతిలోని ఒక కర్మాగారంలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ ప్రమాద వశాత్తు మరణించాడు. అంతకుముందు నుంచే వ్యవసాయం చేస్తున్నా ఆ జ్ఞాపకాలను మరిచేందుకు నాయుడు గారు తన పూర్తి ధ్యాసనంతా వ్యవసాయంపైనే కేంద్రీకరించారు.

మునిరత్నం నాయుడుకు భార్య కుసుమ కుమారి వ్యవసాయంలో చేదోడువాదోడుగా వుండటమే కాదు, ఆయన సేంద్రియ వ్యవసాయ ప్రచార నిమిత్తం వివిధ స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థల ఆహ్వానం మేరకు వ్యవసాయ శిక్షణా కార్యక్రమాలకు వెళితే ఆమే స్వయంగా వ్యవసాయాన్ని తన భుజాలపై వేసుకుని చేస్తుంది.

తన వ్యవసాయ జీవితాన్ని గురించి మునిరత్నం నాయుడు మాటల్లోనే విందాం..... నాకు తెలిసి 1962 నుండి రసాయనిక ఎరువుల వాడకం ప్రారంభమమైంది. అంతకు ముందు సేంద్రియ వ్యవసాయమే చేసేవారు. అంటే వరి నాటిన తర్వాత కలుపు తీసేటపుడు వేరుశనగ చెక్కను మళ్ళలో వేసి పొలాన్ని కలియదున్నేవాళ్లం. అప్పుడు ఆ రోజుల్లోనే ఎకరాకు 35 బస్తాల ధాన్యం పండేది. 62 తర్వాత రసాయనిక ఎరువు వచ్చాయి. మొదట్లో సల్ఫేట్ మాత్రమే వాడాము. ఆ తర్వాత కంప్లెక్స్ ఎరువులు, యూరియా వచ్చాయి. అప్పుడు మేము 20 ఎకరాల్లో వంకాయ తోట వేసేవాళ్ళము. దిగుబడి బాగా వచ్చేది. మేము పండించిన వంకాయలను తమిళనాడులోని మద్రాసు, కుంభకోణంలకు మరియు నెల్లూరు, విజయవాడలకు కూడా పంపేవాళ్ళము. కేవలం డిసెంబర్ నుండి ఏప్రిల్ వరకు 4 నుండి 6 టన్నుల వంకాయలను పండించేవాళ్ళము అన్నారాయన.



## బ్రహ్మాస్త్రం

2కిలోల వేపాకు, 2 కిలోల సీతాఫలం ఆకు, 2 కిలోల పల్లేరు ఆకు, 2 కిలోల ఉమ్మెత్త ఆకులను తీసుకుని వేరువేరుగా మెత్తగా రుబ్బి వీటన్నింటిని 10 లీ. గోమూత్రంలో కలిపి బాగా ఉడికించాలి. 2 రోజుల తర్వాత ఈ ద్రావణాన్ని ప్రతి ఎకరాకు 100 లీ. నీటిలో 2 నుండి 2.5 లీటర్ల బ్రహ్మాస్త్రం కలిపి పిచికారి చేసుకుంటే పెద్ద పురుగులు నివారించబడతాయి. దీనిని 6 నెలల వరకు నిల్వ ఉంచుకోవచ్చు.





మొదట్లో అలా పండించినా ఏయేటికాయేడు ఈ కాంప్లెక్స్ ఎరువుల పెట్టుబడి పెరగుతోంది కానీ దిగుబడి మాత్రం అంతే వుండటంతో పాటు వీటివల్ల పంటకు రోగాలు పెరిగి ఎరువులతో పాటు పురుగు మందులు కూడా వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా ఖర్చులు పెరుగుతూ చివరికి 90 రూపాయలు ఖర్చు చేస్తే వంద రూపాయల దిగుబడి వచ్చేది అంటే కేవలం 10 శాతం మాత్రమే రైతుకి మిగిలేది. ఇది బాగాలేదని 2007 వరకు వర్మీ కంపోస్టు తోనే మొత్తం వ్యవసాయం చేశాడు. 2008లో "సుభాష్ పాలేకర్ గారి జీరో బడ్జెట్ వ్యవసాయం" బాగా నచ్చి, అప్పటినుండి జీరో బడ్జెట్ వ్యవసాయం చేయాలని నిర్ణయించుకొని తనకున్న 4 జెర్సీ ఆవులను అమ్మి రెండు నాటు (దేశీయ) ఆవులను కొన్నాడు.

దానికి కారణం సేంద్రియ వ్యవసాయంలో నాటు ఆవుదే ప్రధాన పాత్ర. ఎందుకంటే నాటు ఆవుకి 'మూపురం' వుంటుంది. అది సూర్యరశ్మిని ఆకర్షించటం వల్ల ఆవు వ్యర్థాలలో న్యూట్రిన్స్ శాతం ఎక్కువ అంటారాయన. పచ్చిమేత తిన్న నాటు ఆవు పేడను గట్టిగా వేస్తుందని, అదే జెర్సీ ఆవు పేడను పుర్రుగా వేస్తుందని అంటారు. నాటు ఆవులు ఒకసారి తిన్న ఆహారాన్ని మళ్ళీ నెమరు వేసుకుంటాయని, జెర్సీ ఆవులకు నెమరు వేసుకునే అలవాటుగానీ, శక్తి గానీ లేవు అంటారాయన. అంతేగాక, ఒక జెర్సీ ఆవుకు వేసే మేతతో రెండు నాటు ఆవులను పోషించవచ్చు. తనవద్ద వున్న ఆవుల వ్యర్థాలతో జీవామృతం, ఘన జీవామృతం, పంచగవ్యలను తయారు చేసుకోవటంతో పాటు ఆవు మూత్రంలో ఎన్నో రకాల క్రిమి సంహారకాలను తయారు చేసుకోవచ్చు అంటారాయన.

పొలాన్ని దుక్కి దున్నటానికి ముందు భూమిపై జీవామృతం వేస్తారు. దానినే పంటలపై కూడా కల్లాపిలా చల్లుతారు. చాలామంది జీవామృతాన్ని వడపోసి స్ప్రే చేస్తారు. కానీ నేను వడపోయకుండానే నేరుగా పంటపై కల్లాపిలా చల్లుతాను అంటారాయ. రైతు అనేవాడు ముఖ్యంగా మిశ్రమ పంటలను వెయ్యాలని, ఉదా. వంకాయలు మాత్రమే పండిస్తే పంట కాలం మొత్తంలో ఒక్కోసారి 20 రూ. కిలో వస్తుందని, మరోసారి 5 రూ. కూడా కిలోకి రావని అలాంటి సమయాల్లో ఒకే పంటను వేసుకుని నష్టపోకుండా పొలంలో ఒక వరుస వంకాయ, ఒక వరుస బెండ, ఒక వరుస చిక్కుడు, మరో వరుస కాకర ఇలా మరలా మరలా పొలమంతా వేస్తే రైతు ఒడిదుడుకులను తట్టుకోవటమే కాక ఎప్పుడూ ఏదో ఒక కూరగాయను మార్కెట్‌కు తరలిస్తుండటం వల్ల ఆ డబ్బుతో తనకున్న మిగతా పొలంలో చెరకు, వరి లాంటి పంటలకై పెట్టుబడిగా వినియోగిస్తే యేడాది చివరలో ఆ పంటపై వచ్చిన ఆదాయం మొత్తం నికరంగా మిగులుతుందని. ఇలా చేస్తేనే రైతు అభివృద్ధి చెందుతాడని అంటున్నారు. తనకున్న 4 ఎకరాల పొలంలో ఎప్పుడూ అర ఎకరం కూరగాయలకే కాటాయిస్తానని, వాటిపై వచ్చిన డబ్బుతో మిగతా పొలంలో చెఱకు పండిస్తానని అంటారు మునిరత్నం నాయుడు.

జీవామృతం, ఘనజీవామృతం, పంచగవ్యలతో పాటు క్రిమి సంహారకాలకై నీమాస్త్రం, వావిలాకు



### నీమాస్త్రం

5 కిలోల పచ్చి వేపాకు లేదా ఎండు ఆకులు లేదా వేపపండ్ల పొడి, 100 లీ. నీటిలో కలిపి 5 లీటర్ల గోమూత్రం, ఒక కిలో ఆవుపేడ కలిపి కర్రతో బాగా కలియబెట్టాలి. 24 గంటల తర్వాత గుడ్డతో వడగట్టి పంటపై పిచికారి చేస్తే రసం పీల్చే పురుగులు నివారించబడతాయి.



కషాయం, సీతాఫల ఆకుల కషాయాల లాంటివెన్నో తానే స్వయంగా చేసుకుంటాడు. పొలంలో అప్పుడప్పుడూ 'అగ్నిహోత్రం' కూడా చేస్తారు. సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో అగ్నిహోత్రం చేస్తే పంటలకు ఎంతో మంచిదని అంటారు. పూర్వం రాజులు యాగాలు చేసిన తర్వాత యాగఫల బూడిదను గుర్రాలపై పొలాల్లో చల్లించేవారట. సూర్యోదయం, సూర్యాస్తమయాల్లో "బియ్యం, ఆవునెయ్యి లను నాటు ఆవు పిడకలపై వేసి పొలం గట్లచుట్టూ అక్కడక్కడా పెట్టి వెలిగిస్తే వాటినుండి వచ్చే పొగ వల్ల పంట ఆరోగ్యంగా వుండటంతో పాటు హానికరమైన క్రిమి కీటకాలు కూడా నశిస్తాయని, మిత్ర పురుగులకు ఈ పొగ ఎంతో సహాయకారిగా వుంటుంద"ని అంటారు.

సేంద్రియ వ్యవసాయం చేసుకుంటూ క్రిమి కీటకాలు నియంత్రించలేని స్థితిలో ఎప్పుడైనా రసాయనిక పురుగు మందులు పిచికారి చేయవచ్చునా అన్న ప్రశ్నకు నాయుడుగారు స్పందిస్తూ కడివెడు పాలలో ఒక చుక్క మజ్జిగ చాలుకదా అది చెడిపోవటానికి. అలాగే ఒక్కసారి రసాయనిక మందు చల్లితే ఏమీ కాదని కొందరు మిడిమిడి జ్ఞానంతో రైతాంగాన్ని చెడగొడుతూ వుంటారని, ఒక్కసారి రసాయని మందులు వాడినా సేంద్రియ పద్ధతి దెబ్బతింటుందని, మళ్ళీ అది తొలగటానికి ఎంతో సమయం పడుతుందని అంటారు.

అత్యంత ప్రమాదకర పురుగులను నియంత్రించటానికి తాను 'రామబాణం' తయారు చేసుకుని ప్రయోగిస్తానని అంటారు. ఆవు పంచకం (మూత్రం), అల్లం, నాటు ఆవు పేడ, బెల్లం, ఇంగువ, శనగపిండి, మురిగిన మజ్జిగలను ఉపయోగించి ఈ రామబాణం తయారు చేసుకోవాలని, దీన్ని 40 రోజులపాటు పొలంపై చల్లితే భూమిలో వున్న రసాయనాలు పూర్తిగా తొలగిపోయి, సంపూర్ణంగా సేంద్రియ యోగ్యంగా భూమి తయారు అవుతుందని, కొత్తగా సేంద్రియ వ్యవసాయం చేయాలనుకునేవారు దీన్ని పొలంపై వేసినప్పటినుండి సేంద్రియ పద్ధతులను అవలంభించవచ్చు అంటారు నాయుడు గారు.

భూమిలో రసాయనాలు పూర్తిగా తొలగిపోయిన తర్వాత పొలంలో ఎరలు (ఎర్త్‌వార్మ్స్) ఉత్పత్తి అవుతాయని, వర్మీ కంపోస్టులో వుండే ఎరలు చెత్తా చెదారం, ఆవు పేడలను మాత్రమే తింటాయని, భూమిలోని ఎరలు మట్టిని తింటూ రోజుకు 14 మీ. లోతు వరకు వెళ్ళి బయటకు రావటంతో మట్టి బాగా తిరగతోడబడి మంచి పంటలను ఇస్తుందని అంటారు. నాటు ఆవు పేడను, జెర్సీ ఆవు పేడను పక్క పక్కగా వేసి ఎరలను వదిలితే అవి ముందుగా నాటు ఆవు పేడను మట్టిగా మారుస్తాయని, జెర్సీ ఆవు పేడను అంతగా మట్టిగా తయారు చేయవని అంటారాయన. కావలిస్తే రైతులు దీన్ని పరీక్షించుకోవచ్చు అంటారు.

ఈమధ్య నాయుడు గారు తిరుపతి వ్యవసాయ అధికారివద్ద వుండగా అక్కడికి ఒకరైతు తన పొలంలోని మిరప చెట్టుతో వచ్చాడు. దానికి పైముడత తెగులు, కింది ముడత



## అగ్ని అస్త్రం

1 కిలో పొగాకు, 5 కిలోల వేపాకు, 2 కిలోల పచ్చి మిరపకాయలు, అరకిలో వెల్లుల్లి లను వేరువేరుగా మెత్తగా నూరుకుని వాటిని 10 లీ. గోమూత్రంలో కలిపి 4సార్లు పొంగు వచ్చేలా ఉడికించాలి. 2 రోజుల తర్వాత దీన్ని వడగట్టి ఒక డబ్బాలో వుంచుకోవాలి. ప్రతి ఎకరాకు 100 లీ. నీటిలో 2 నుంచి రెండున్నర లీటర్ల అగ్ని అస్త్రాన్ని కలిపి పిచికారి చేస్తే కాండం తొలుచు పురుగు, కాయ తొలుచు పురుగులే కాకుండా అన్ని రకాల పురుగులు నివారించబడతాయి.

తెగులు, ఎండుకొమ్మ తెగులు సోకివుంది. దాన్ని ఆ అధికారికి చూపించి నివారణకు ఏమేమి మందులు కొట్టమంటారు అని అడుగగా దానికా అధికారి పైముడతకు 'రోగోర్', క్రింది ముడతకు 'జోలాన్', ఎండుకొమ్మ తెగులు నివారణకు మరో మందు కొట్టమని సలహా ఇచ్చారు. ఇన్ని మందులు కొట్టి రైతు ఏమి మిగుల్చుకుంటాడు అని ఆలోచించిన నాయుడు ఆ రైతుతో అయ్యా మీరీ మందులేవీ కొట్టనక్కర లేదు. నీవు నీ పొలంలో ఏ ఎరువులు ఎక్కువగా వాడావా అని అడుగగా అతను యూరియా ఎక్కువగా వాడానని సమాధానం చెప్పటంతో ఆ యూరియా తోనే నీ మిరప పంట ఇలాంటి తెగుళ్ళ బారిన పడిందని, సరే జరిగిందేదో జరిగింది ఈ మందులేవీ కొనకుండా నీవు ఇంటికి వెళ్ళి నీవద్ద ఆవు వుంటే సరే లేదంటే ఊళ్ళో ఎవరివద్దనైనా ఆవు వుంటే వారికి దండం పెట్టి 10 కిలోల ఆవు పేడ, ఒక రాత్రంతా నీవు అక్కడే వుండి 10 లీటర్ల ఆవు మూత్రం సేకరించు, రెండింటినీ కలుపు దాన్లోకి 100 గ్రా. పసుపును కలిపి 24 గంటలు మురగనివ్వు. రెండు రోజుల తర్వాత చెట్టు ఆకులు, మొదళ్ళు బాగా తడిసేలా చెట్లపై చిలకరించు, ఈ తెగుళ్ళన్నీ నివారించబడతాయి. దీనివల్ల నీకు ఖర్చయ్యేదేమీ లేదు, కాస్తంత పని మాత్రమే అన్నాడు. నాయుడు చెప్పిన విధంగా చేసి, తన మిరప తోట ఆరోగ్యంగా తయారవటంతో ఎంతో ఆనందంతో ధన్యవాదాలు తెలిపాడట ఆ రైతు.

యూరియా ఎక్కువగా వాడటం వల్ల కాండం చుట్టూ వున్న బెరడు నీరసించిపోయి ఆకులు నల్లబారుతాయి. దానితో ఆకులు కిరణజన్య సంయోగ క్రియను సక్రమంగా చేసుకోలేని స్థితికి చేరటం వల్ల ఇలాంటి నానా రకాల తెగుళ్ళకు గురవుతాయని అంటారు నాయుడు గారు. అదేవిధంగా యూరియా ఎక్కువగా వాడితే ఏప్రిల్, మే నెలల్లో వంగకు, బెండకు 'రెడ్‌మెట్' తెగులు సోకుతుంది. అంటే ఆ ఆకులపైన ఎర్రపేను సోకుతుంది. అప్పుడు ఆకులు పసుపు వర్ణంలోకి మారిపోయి, వాటిని పట్టుకుంటే చేతులకంతా దురదలాగా అనిపిస్తుంది. దానివల్ల క్రమేణా చెట్టు కూడా చనిపోతుంది. దీని నివారణకు 'మిర్చి, వెల్లుల్లి పేస్ట్' వాడితే నివారించుకోవచ్చు. దీని తయారీకై ఒక కిలో పచ్చి మిరప కాయలు, ఒక కిలో వెల్లుల్లి (తెల్లగడ్డలు), రెండు లీటర్ల కిరోసిన్ తీసుకోవాలి. పచ్చి మిర్చి, వెల్లుల్లి గడ్డలను వేరువేరుగా రుబ్బుకుని, తగినంత నీటిలో ఉడకబెట్టుకుని, దానికి కిరోసిన్‌ను కలపాలి. తయారైన ఈ ద్రావకాన్ని పంటపై పిచికారి చేస్తే ఈ రెడ్‌మేట్ పూర్తిగా నివారించ బడుతుంది అంటారు నాయుడుగారు. ఈ రెడ్‌మేట్ నివారణకు ఎన్ని రసాయన మందులు కొట్టినా పూర్తిగా నాశనమవదని, ఈ వెల్లుల్లి, పచ్చిమిర్చి పేస్టుతో సంపూర్ణంగా నాశనమవుతుందని అంటారాయన.

రైతు అనేవాడు ప్రతి పదిహేను, 20 రోజుల


# ఎన్.ఆర్.వి. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. అటువంటి వారు తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 800/–లతో 5 సంవత్సరాల పాటు గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది.

మీ గ్రామం నుండి వెలుపల జీవనం సాగిస్తున్న మీ మిత్రులకు ఈ విషయం తెలియజేయండి. వారు 'పల్లెసృజన' పత్రికకు చందా పంపి, ఈ పత్రిక మీ గ్రామానికి వచ్చే ఏర్పాటు చేస్తారు.

చందా వివరాలు ఈ పత్రిక చివరి కవర్ పేజీలో ఇవ్వటమైనది. వీలైనన్ని ఎక్కువ గ్రామాలకు పత్రిక వెళ్ళేందుకు సహకరించాల్సిందిగా కోరుతున్నాము.

– ఎడిటర్




వ్యవధిలో తమ పంటలపై జీవామృతం చల్లుకో గలిగితే ఆయా పంటలు ఆరోగ్యంగా వుండి ఏపుగా పెరగటంతో పాటు మంచి దిగుబడిని కూడా సాధిస్తాయని అంటారాయన.

అలాగే వేరుశనగకు పచ్చ పురుగు వల్ల విపరీతమైన నష్టం వాటిల్లుతుంది. దీని నివారణకు జీవామృతం వేరుశనగ పైరుపై కల్లాపిలా చల్లితే, ఆ శనగపచ్చ పురుగులు ఇక ఆకులను తినలేక, తమకు ఆహారం లేక క్రమేణా నశించి పోతాయంటారాయన. అంతేగాకుండా ఒక 20 కిలోల ఆవుపేడ, 5 లీటర్ల ఆవు మూత్రం, 10 కిలోల వరిపొట్టు, 2 కిలోల బెల్లం అన్నింటిని కలిపి చిన్న చిన్న వుండలుగా (మాత్రల్లా) తయారవుతుంది. వీటిని సాయంత్రం 4 గంటల తర్వాత పొలంలో చల్లితే ఏ పంటలను ఆశించే పురుగులైనా తియ్యగా కనపడటంతో వాటిని తిని క్రమేణా క్షీణించి చనిపోతాయి అంటారాయన.

శనగపచ్చ పురుగు నివారణకు వాటినే వినియోగించి నశింపజేశానంటారాయన. శనగపచ్చ పురుగు ఆశించిన పొలంలో ఆ పురుగులను కొన్నింటిని సేకరించి, మెత్తగా నూరి, కొద్దిగా నీటిలో కలిపి జ్యూస్‌లాగా తయారు చేయాలి. తర్వాత దాన్ని వడగట్టి అందులో ఒక లీటర్ కిరోసిన్ కలిపి ఆ ద్రావణాన్ని 5 మి.లీ. ఒక లీటరు నీటితో కలిపి పిచికారి చేస్తే శనగపచ్చ పురుగు పూర్తిగా నివారించబడుతుంది అంటారాయన. అంటే శనగపచ్చ పురుగుకు శనగపచ్చ పురుగే నివారణ మందు.


'జీవామృతం' సర్వరోగ నివారణి అని, జీవామృతంలో 108 రకాల న్యూట్రిన్స్ వున్నాయని, ఆవు మూత్రంలో అంతటి అద్భుతమైన శక్తి వుందంటారాయన. కాస్త ఇబ్బందిగా వున్నా ఎవరైనా ఆవు మూత్రాన్ని కొద్దిగా తీసుకుని తాగితే కొద్దిసేపటి తర్వాత గొంతులో తియ్యదనం వస్తుంది కావలిస్తే పరీక్షించుకోమంటారాయన.


నాయుడు గారు ప్రస్తుతం పూర్తిగా సేంద్రియ వ్యవసాయం ద్వారా ఎకరాకు 35 బస్తాల వరి, 45 నుంచి 50

## పంచగవ్య తయారీ - ఉపయోగము

**కావలసిన పదార్థాలు :** ఆవు పేడ 7 కిలోలు, ఆవు మూత్రం 3 లీటర్లు, నీరు 10 లీటర్లు, ఆవు పాలు 2 లీటర్లు, ఆవు పెరుగు 2 లీటర్లు, ఆవు నెయ్యి 1 కిలో, చెరుకు రసం లేదా బెల్లం 3 కిలోలు, అరటి పండ్లు 12, కొబ్బరి బోండాం నీళ్ళు 3 లీటర్లు, స్వచ్ఛమైన ఈత కల్లు లేదా పులిసిన మజ్జిగ 2 లీటర్లు.

**తయారీ విధానం :** వెడల్పాటి మూతిగల ప్లాస్టిక్ డ్రమ్ముగాని లేక కుండగాని తీసుకొని ముందుగా ఆవుపేడ + ఆవు నెయ్యి కలిపి 2 రోజులుంచాలి. ఆవు మూత్రం + 10 లీ. నీరు కలిపి 15 రోజులు, చెరుకు రసం/బెల్లం+ ఆవుపాలు + ఆవు పెరుగు + కొబ్బరి నీళ్ళు + కల్లు/పులిసిన మజ్జిగ+ అరటి పండ్లు కలిపి 15 రోజులు కలియబెట్టాలి. పై ద్రావణాన్ని వడగట్టి 6 నెలల వరకు నిలువ చేసుకోవచ్చు దీనిలో 75% హార్మోన్స్ ప్రభావం, 25% క్రిమి సంహారక ప్రభావం వుంటుంది.




**ఉపయోగించు విధానం :** 3 లీటర్ల పంచగవ్యను 100 లీటర్ల నీటిలో కలిపి వడగట్టి పంటపై 15 రోజులకోసారి పంట ఏ స్థితిలో వున్నా వాడుకోవచ్చు. లేదా నేలపై స్ప్రే చేసుకోవచ్చు లేదా డ్రిప్ ద్వారా పంపించుకోవచ్చు లేదా 200 లీటర్ల పంచగవ్యను పారే నీటిలో కలుపుకోవచ్చు లేదా డ్రిప్ ద్వారా పంపించుకోవచ్చు. ఫలితం ఒకేవిధంగా వుంటుంది.

టన్నుల వరకు చెరుకు వస్తుందని, తాను 4 అడుగులకో వరుస చెరుకు నాటుతానని మధ్యలో కూరగాయలను పండిస్తానని, చెరకు పెరిగే టప్పటికి ఈ కూరగాయల పంటలన్నీ పూర్తి అయిపోతాయని అంటారాయన. బెండను వేసి పంట పెద్దగా అయ్యేటప్పటికి బెండను కోసుకున్న తర్వాత బెండ చెట్ల తీసివేయకుండా చెరకు పూర్తయిన తర్వాత చెరుకుతో పాటు బెండ కాడలను కూడా రసం తీసేటప్పుడు అందులో కలిపి రసం తీస్తే బెల్లం కొద్దిగా రోజ్ కలర్‌లో వస్తుందని ఆ రంగు అద్భుతంగా వుండటంతో పాటు తినేవారికి కూడా ఆరోగ్యంగా వుండటమే కాక 6 నెలల వరకు చెక్కు చెదరకుండా నిలువ వుండటమే కాక, మంచి ధర కూడా పలుకుతుంది అంటారు. ప్రస్తుతం బెల్లం తయారీదారులు మంచి రంగు కోసం, ఎన్నెన్నో రసాయనాలు వాడుతున్నారని, ఇవేవీ వాడకుండా బెండను ప్రయోగిస్తే ఎలాంటి రసాయనాలు వాడవలసిన అవసరం లేదని, మంచి రంగుతో పాటు నిలువ సామర్థ్యం కూడా పెరుగుతుందని అంటారు నాయుడుగారు.

మునిరత్నం నాయుడు గారి వ్యవసాయ పద్ధతులను రైతాంగం వినియోగించుకుని రసాయనాల నుండి భూమిని, వాతావరణాన్ని కాపాడటంతో పాటు రైతులు స్వయం సమృద్ధి సాధించాలని 'పల్లెసృజన' ఆశిస్తోంది. ఎవరైనా రైతులు ఇంకా ఈ సేంద్రియ వ్యవసాయన్ని గురించి పూర్తిగా తెలుసుకోవాలంటే మునిరత్నం నాయుడు గారు స్వయంగా వచ్చి మీ పొలం వద్దనే వుండి అన్ని రకాల కషాయాలను, ఎరువులను, క్రిమి సంహారకాలను మీతోనే తయారు చేయించి సేంద్రియం వైపుకు మళ్ళేలా సలహాలతో సహకరిస్తారని, కేవలం రవాణా ఖర్చులు ఇస్తే చాలునని మునిరత్నం నాయుడు గారు తెలియజేస్తున్నారు. రైతులు వీరి సలహాలను తప్పకుండా తీసుకుని సేంద్రియ వ్యవసాయం చేసి వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు తమవంతు ప్రోత్సాహం అందిస్తారని 'పల్లెసృజన' మనసారా కోరుకుంటోంది.

**మునిరత్నం నాయుడు గారి ఫోన్ : 9989509877**

## జీవామృతం తయారీ - ఉపయోగము

**కావలసిన పదార్థాలు : దేశవాళీ ఆవు (నాటు ఆవు) పేడ 10 కిలోలు, ఆవు పంచకం 10 లీ., బెల్లం 2 కిలోలు లేదా చెరుకు రసం 4 లీ., పప్పు ధాన్యాల పిండి 2 కేజీలు, ఒక పిడికెడు చెరువు మట్టి లేదా చేలోని మట్టి మరియు 200 లీ. నీరు.**

**తయారీ విధానం :** ఒక తొట్టిలో 200 లీ. నీటిని పోసి 10 కిలో పేడను అందులో వేసి బాగా కలియబెట్టాలి. బెల్లం, పిండి అందులో వేసి మళ్ళీ కలియబెట్టాలి. తరువాత ఆవు పంచకం, పిడికెడు మట్టిని వేసి మళ్ళీ కలపాలి. తర్వాత తొట్టిపై గోనెసంచి కప్పి 2 నుంచి 7 రోజులు కుళ్ళనివ్వాలి. తొట్టిని నీడలో వుంచి రోజుకి రెండు మూడుసార్లు కలుపుతూ కుళ్ళబెట్టాలి. ఈ విధంగా జీవామృతం తయారవుతుంది. ఈ జీవామృతంలో మైక్రో ఆర్గానిజమ్స్ విస్తారంగా వుండి భూమిని సారవంతం చేయడానికి ఉపయోగ పడుతుంది. వారంలోపు జీవామృతాన్ని భూమికి అందించినచో మంచి ఫలితం వుంటుంది. ఇది భూమిలోని రైతుకు సహాయం చేసే మిత్ర సూక్ష్మజీవులను కాపాడుతుంది, పెంపొందిస్తుంది.




**ఉపయోగించే పద్ధతి :** ఒక ఎకరానికి 200 నుంచి 400 లీటర్ల జీవామృతం ఉపయోగించ వచ్చు. 30 రోజులకు ఒక పర్యాయం వాడాలి. 15 రోజులకోసారి వాడినచో మంచి ఫలితం వుంటుంది. నీళ్ళు పారే సమయంలో జీవామృతాన్ని కుళాయి ద్వారా అందించి భూమిలో పూర్తిగా తడిచేటట్లు ఏర్పాటు చేసుకోవాలి. ఇది ఖర్చులేనిది, ఆచరించ దగ్గది.



## వృత్తి- వ్యవసాయాల మేళ్కలయిక సాధించిన ఏలా రవి

# హీరో హోండాతో సులువైన వీడర్

- పల్లె వీర రాఘవ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలోని జనగామ జిల్లా, కిష్టగూడెం గ్రామవాసి ఏలా రవి. భార్య రమ, కొడుకు, కూతురుతో కూడిన పొందికైన కుటుంబం. ఇతను గ్రామ సమీపంలోని జిల్లా కేంద్రమైన జనగామలో మెకానిక్ షెడ్డు ఏర్పాటు చేసుకుని రోజూ ఊరి నుండి తిరుగుతూ వ్యాపారం చేస్తుంటాడు. భార్య రమ ఇంటివద్ద పిండి మర, కిరాణా కొట్టులను నడిపిస్తూ భర్తకి చేదోడు వాదోడుగా వుంటుంది. కష్టపడి కొద్దో గొప్పో సంపాదించుకోవాల్సిన వయసు ఇదే కదా అంటారు దంపతులిద్దరు. అలా కష్టపడి సంపాదించిన దాంతో తమకు ఇష్టమైన వ్యవసాయ భూమి 2 ఎకరాలు కొనుగోలు చేశారు. తమ పొలంలో ఎక్కువగా ప్రత్తి సాగు చేస్తూ వుంటారు.

కొత్తగా వ్యవసాయం పనులలోకి మారటంతో పొలం దున్నుకోవటానికి కిరాయి ట్రాక్టరుతో పని చేసుకుని విత్తనం నాటుకోవడం, ఆ తర్వాత అంతర సేద్యాల కొరకు గ్రామంలోని ఎద్దుల యజమానులను బ్రతిమాలి సేద్యం చేయించుకుంటూ వుండేవారు. అంతర సేద్యాలు అవసరమైనపుడు ఎద్దులు లభించక, లభించినా కిరాయి ఎక్కువ కావటంతో వ్యవసాయ ఖర్చులు పెరిగేవి. స్వతహాగా మోటార్ సైకిల్ మెకానిక్ అయిన ఏలా రవి తనవద్ద వున్న ఒక పాత హీరో హోండా మోటార్ సైకిల్‌తో అంతర సేద్యాలకు అనువుగా ఒక వీడర్‌ను రూపొందిస్తే ఈ ఖర్చు తగ్గుతుంది కదా అనుకున్నాడు.

వివిధ రకాల వీడర్లను గమనించి తాను ఒక వీడర్ తయారు చేశాడు. అది నడవటానికి టైర్లు ఏర్పాటు చేయటం వల్ల పొలంలో ఆ టైర్లతో సరిగా సేద్యం నడవటం లేదని గ్రహించి వెల్డర్ వద్దకు పోయి ఇనుప చక్రాలను ఏర్పాటు

చేయించాడు. ఇక మోటార్ సైకిల్‌లోని చక్రాలు బేస్‌మెంట్ తప్ప దాదాపు అన్ని పరికరాలను ఉపయోగించుకున్నాడు.

ఒక చట్రంపై ఇంజన్‌ను కూర్చోబెట్టి, మోటార్ సైకిల్ చైన్‌లు, చైన్ స్ప్రాకెట్లను, పెట్రోలు ట్యాంకు, హ్యాండిల్, క్లచ్ పెడల్, స్టార్టింగ్ కిక్ రాడ్ లాంటి దాదాపు అన్ని పరికరాలను వినియోగించుకున్నాడు. తన ఆలోచనతో ఏ పరికరాన్ని ఎక్కడ అమర్చాలో ఆలోచించి చూడ ముచ్చటగా వీడర్‌ను తయారు చేసుకున్నాడు.

రెండుమూడు సార్లు మార్పులు, చేర్పులు చేసుకున్న తర్వాత ఇప్పుడు తన పొలాన్ని తానే స్వయంగా పెట్రోలు మినహా ఎటువంటి ఖర్చు లేకుండా అంతర సేద్యాలు చేసుకుంటూ మంచి దిగుబడి సాధిస్తున్నాడు ఏలా రవి.

కిక్ రాడ్‌ను చేతితో పైకి లాగటం ద్వారా ఇంజన్ స్టార్ట్ అవుతుంది. క్లచ్‌ను చేతితో పట్టుకుని మొదటి గేర్‌పైనే పొలమంతా దున్నేస్తాడు. ప్రత్తి మరీ పెద్దగా పెరిగినపుడు మాత్రం తప్పనిసరి పరిస్థితుల్లో ఎద్దులతో అంతర సేద్యాన్ని ఒకటి రెండుసార్లు చేయిస్తాడు మిగతా అన్ని పనులకు తను తయారు చేసిన వీడర్‌నే ఉపయోగించుకుంటాడు. ఎండాకాలం ఒకే ఒక్కసారి ట్రాక్టర్‌ను కిరాయికి తీసుకుని బాగా కలియదున్నిస్తాడు. ఆ తర్వాత తన వీడర్‌తోనే ఒకటి రెండుసార్లు గొర్రుతో పొలమంతా మెత్తగా చేసుకుని, విత్తటానికి అనువుగా తయారు చేసుకుంటాడు.

వర్షం పడిన తర్వాత కూడా తన వీడర్‌తోనే గొర్రు తోలి విత్తనాలు నాటిస్తాడు. ఆ తర్వాత అంతర సేద్యాలకు గొర్రు, గుంటకలతో ఇదే వీడర్‌పైన అన్ని పనులు చేసుకుంటాడు. పొలం పనులన్నీ భార్య రమతో కలిసి ఇద్దరే చక్కగా కలిసి పని చేసుకుంటారు. పొలం పనులు లేని రోజుల్లో





రవి తన మెకానిక్ షాపుకు వెళ్తే, అతని భార్య రమ ఇంటివద్ద పిండిమర, కిరాణం దుకాణాల వ్యాపారాన్ని చూసుకుంటుంది. పిల్లలిద్దరినీ చక్కగా చదివించుకుంటూ దంపతులిద్దరూ ఎంతో ఆదర్శవంతంగా జీవిస్తున్నారు.

స్వతహాగా మెకానిక్ కావటం వల్ల తన వీడర్‌లో ఎటువంటి రిపేర్లు వున్నా వెంటనే తానే చేసుకుంటాడు. అయినా ఇందులో రిపేరు అయ్యే సమస్యేమీ వుండదని, కాకపోతే ప్రతి సంవత్సరం గొర్రు, గుంటకలు అరిగి పోతాయి కాబట్టి వాటిని మార్పు చేయటం తప్ప ఎటువంటి ఇబ్బందులు లేవు. తను ఈ వీడర్‌ను తయారు చేసుకోవటంతో ప్రతి పంటకు 15 నుంచి 20 వేల రూపాయల వరకు ఖర్చును ఆదా చేసుకోగలుగుతున్నాము అన్నారు రవి దంపతులు.

ఎంతో సులభమైన మెకానిజంతో రవి తయారు చేసిన ఈ వీడర్‌ను ప్రతి రైతు చక్కగా వినియోగించుకోవచ్చు. ఈ వీడర్‌కు తగిన ప్రాచుర్యం కల్పించి, యావత్ రైతాంగానికి తక్కువ ధరకే అందుబాటులోకి వచ్చేలా ప్రాచుర్యం కల్పించటానికి 'పల్లెసృజన' కృషి చేస్తుంది.

**ఏలా రవి ఫోన్ : 94415 47018**



# ఆయుర్వేద జ్ఞాన మథనం

# 'మెంతులు'తో వైద్య చిట్కాలు



**ఉమా మహేశ్వర రావు, ఆయుర్వేద వైద్యులు, మణుగూరు, ఖమ్మం జిల్లా. ఫోన్ : 94402 86854 :**

ఆయుర్వేద వైద్యంలో 'మెంతులు' ప్రధానమైన పాత్ర వహిస్తున్నాయి. వీటికి తీపి, చేదు, వగరు గుణం వుంటుంది కాబట్టి వీటిని చాలా ఆయుర్వేద మందులలో ఉపయోగిస్తారు. శరీరంలో రోగ నిరోధక శక్తి పెంచే గుణం వీటికుంది. మెంతులులో జిగురు పదార్థాన్ని వృద్ధి చేసే గుణం వుండటం వల్ల శరీరంలోని క్రొవ్వు మరియు వ్యర్థ పదార్థాలను బయటకు నెట్టివేస్తుంది. అందుకే భారతీయులు అన్ని రకాల వంటల్లో ముఖ్యంగా పచ్చళ్ళలో మెంతి పొడిని తప్పకుండా కలుపుతారు. శరీరంలో హానిని తలపెట్టే గుణాలు ఏవి వున్నా దీనికి తొలగించే గుణం వుంది. మెంతులు కీళ్లలో ఎముకల మధ్యలో జిగురు పదార్థాన్ని పెంచటం వల్ల కీళ్ళ నొప్పులను తగ్గిస్తుంది. ఇలా మెంతులు భారతీయ వైద్యంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయి. మెంతి పొడిని అన్ని రకాల వంటలలో నిరంతరం ఉపయోగిస్తూ వుండటం వల్ల చాలా రోగాలకు నియంత్రణగా పని చేస్తుంది. మెంతులు ఉపయోగించటం వల్ల నయమయ్యే వ్యాధులను గురించి తెలుసుకుందాం.

**శరీరంపై గల గడ్డలు, కురుపులు మానటానికి :**

మెంతులను మెత్తటి పొడిగా చేసుకుని శరీరంపై ఎక్కడైనా గడ్డల లాంటివి, కురుపులు వున్నట్లయితే ఈ పొడిని కొద్దిగా నీటితో తడిపి మెత్తటి పేస్టులాగా తయారు చేసుకుని ఆ ప్రాంతంలో పైపూతగా పూసినట్లయితే త్వరలోనే మానిపోతాయి.

**మానసిక వత్తిడి తగ్గటానికి, జ్ఞాపకశక్తి పెరగటానికి :**

కొందరు వ్యక్తులు మానసిక వత్తిడి పెరగటం, జ్ఞాపక శక్తి కోల్పోతున్నట్లు అనిపించటం జరుగుతుంటుంది. అలాంటి వ్యక్తులు మెంతులను మెత్తటి పొడిగా చేసుకుని గ్లాసు పాలలో కలుపుకుని 5 రోజులపాటు తీసుకున్నట్లయితే జ్ఞాపక శక్తి పెరగటంతో పాటు మానసిక వత్తిడులను కూడా తగ్గిస్తుంది. ఇలా నాలుగు లేదా ఆరు మాసాలకు ఒకసారి అంటే సంవత్సరానికి రెండు లేదా మూడుసార్లు తీసుకుంటే చాలు 'వత్తిడి' తగ్గిపోతుంది.

**తెలియకుండా బేదులు (మోషన్స్) అయ్యే వారికి మెంతులతో వైద్యం :**

కొందరు వ్యక్తులకు తమకు తెలియకుండానే బేదులు అవుతో వుంటాయి. అటువంటి వ్యక్తులు ఒక గ్లాసు పెరుగులో ఒక చెంచా మెంతుల పొడి కలుపుకుని, ఐదు నిమిషాల తర్వాత దాన్ని సేవించినట్లయితే తెలియకుండా పోయే మోషన్ ఆగిపోతుంది. ఒకవేళ ఎక్కువ విరోచనాలు అవుతున్నా ఒక చెంచా మెంతులు పొడిని మజ్జిగలో కలుపుకుని త్రాగినా విరోచనాలు తగ్గిపోతాయి.

**బియ్యంలో పురుగు పట్టకుండా మెంతులతో పరిష్కారం :**

చాలామంది సంవత్సరానికి సరిపడ బియ్యంను ఒకేసారి కొని పెట్టుకుంటూ వుంటారు. అటువంటి వారు బియ్యానికి పురుగు పట్టకుండా వుండేందుకు పిడికెడు మెంతులను ఒక గుడ్డలో కట్టి బియ్యం సంచిలో మధ్యన పెట్టినట్లయితే బియ్యానికి పురుగు పట్టదు. వీటికి పురుగులను దరిచేరకుండే చేసే గుణం వుంది. అందుకే పూర్వం (ఇప్పుడు కూడా) కాగితాలను నీటిలో బాగా నానబెట్టి వాటిలో మెంతులను కలిపి మెత్తగా రుబ్బి పేస్టులాగా తయారు చేసుకుని ఇంట్లో ఉపయోగించే చాటలు, గంపలకు పూతగా పూస్తారు. అలా చేస్తే ఇక వాటికి పురుగు పట్టి పాడవకుండా వుంటాయి. లేదా వెదురుతో చేసిన ఈ గంపలు, చాటలు పురుగు పట్టి పాడైపోతాయి. బియ్యమే కాదు, ఏవైనా పురుగు పడుతుంది అనుకునే ధాన్యంలో మెంతులను మూట కట్టి వేస్తే చాలు ఇక వాటికి పురుగు పట్టదు.

**తలలో చుండ్రుకు, ఇతర తల సంబంధ రుగ్మతలకు మెంతులతో వైద్యం :**

ఒక్కోసారి తలలో చిటపట అనటం, అక్కడక్కడా నొప్పిగా వున్నట్లు అనిపిస్తూ వుంటుంది. అటువంటి వ్యక్తులు మెంతెపు పొడిని ఒక గుట్టలో చుట్టుకుని అప్పుడప్పుడూ వాసన చూస్తూ వుంటే చాలు తలలోని రుగ్మతలు పోయి హాయిగా వుంటుంది. కొద్దిగా వేపాకు, మెంతులు కలిపి మెత్తగా నూరి

తలకు పట్టించి ఒక గంట తర్వాత స్నానం చేసినట్లయితే తలలో చుండ్రు నయమౌతుంది. చుండ్రు బాగా ఎక్కువగా వున్నవారు ఈ పేస్టులో కొంత నిమ్మరసం కూడా కలిపి పెట్టుకుంటే చుండ్రుతో పాటు తలలో ఏవైనా కురుపులు ఉన్నా కూడా నయమౌతాయి.

**శరీరంలో తెలియని రుగ్మత (అనీజీ) కి వైద్యం :**

ఇంట్లో పెనంపైన మెంతులు వేసి వేడి చేస్తూ, బాగా కాగిన తర్వాత వాటినుండి వచ్చే పొగను పీలిస్తే శరీరంలో ఏదో అనీజీగా వుంది అన్న భావనకు సరియైన మందుగా పనిచేస్తుంది. అలా వేయించిన మెంతులను పొడిగా చేసుకుని, నిప్పులపై వేసి ఆ పొగను పీల్చుకునేలా చేస్తే అపస్మారక స్థితిలో వున్నవారు కూడా లేచి కూర్చుంటారు. అందుకే పూర్వం చిన్న పిల్లలకు స్నానం చేయించిన తర్వాత సాంబ్రాణి, మెంతి పొడి నిప్పులపై వేసి ఆ పొగను పట్టించేవారు.

**శరీరంలో దుర్వాసన తొలగించేందుకు మెంతులతో మందు :**

చెమటవల్ల, మరే ఇతర కారణాల వల్లయినా కొందరు వ్యక్తులకు శరీరం నుండి దుర్వాసన వస్తూ వుంటుంది. అటువంటి వ్యక్తులు ఎన్ని రకాల సబ్బులు వాడినా అది తగ్గినట్లు అనిపించదు అటువంటి వ్యక్తులు ఆముదంలో మెంతుల పొడిని కలిపి శరీరానికి మర్దనా చేసుకుని ఒక గంట తర్వాత స్నానం చేస్తే చాలు శరీరం నుండి వచ్చే ఎటువంటి దుర్వాన అయినా సరే మటుమాయమౌతుంది. ఇలా సంవత్సరంలో మూడు నాలుగు సార్లు చేస్తే చాలు ఇక శరీరం నుండి ఎటువంటి వాసన రాదు. ఎందుకంటే ఆముదపుతో కలిసిన మెంతిపిండి శరీరంలోని స్వేద రంధ్రాలను శుభ్రం చేసేస్తుంది. అందువల్ల వాసన రాకుండా నివారిస్తుంది. మరీ దుర్వాసన ఎక్కువగా వున్న వ్యక్తులు స్నానం చేసేటప్పుడు శరీరానికి సున్నిపిండి లేదా మట్టిని రుద్దుకుని స్నానం చేస్తే ఇంకా మంచి గుణం వుంటుంది.

**గోర్లు పుచ్చిపోవటాన్ని నివారించేందుకు :**

చాలామందికి గోర్లు పుచ్చిపోయి చూడటానికి చాలా ఎబ్బెట్టుగా తయారవుతూ వుంటాయి. అటువంటి వ్యక్తులు తులసి ఆకులు, మెంతులు కలిపి మెత్తగా చేసుకుని గోర్లకు గోరింటాకులా మూడు రోజులకు ఒకసారి చొప్పున అలా ఐదారు సార్లు పెట్టుకున్నట్లయితే పుచ్చిపోయిన గోరు స్థానంలో కొత్తగోరు బాగా వస్తాయి. భక్తిభావం వున్న కొందరు వ్యక్తులు తులసి ఆకును కాళ్ళకు పెట్టుకోవటం మంచిది కాదు అనుకుంటూ వుంటారు. అటువంటి వ్యక్తులు సన్నజాజి పూల మొక్కల ఆకుల లేదా దొండ మొక్క ఆకులతో మెంతులను కలిపి ఆ మిశ్రమాన్ని గోరింటాకులా పెట్టుకున్నా బాగానే పని చేస్తుంది. రెండుమూడు సార్లు పెట్టుకున్న తర్వాత కొత్త గోరు వస్తున్నట్లు గమనించవచ్చు.

**అబ్దుల్ కరీం, ఆత్మకూరు, కర్నూలు జిల్లా. ఫోన్ : 85004 91978 :**

ఆయుర్వేదంలో మెంతులు అద్భుతమైన పాత్రను పోషిస్తాయి. వీటిలో ఎన్నో గుణాలు దాగున్నాయి. రక్త హీనత నుండి ఉపశమనం కలిగించి, రక్తవృద్ధికి తోడ్పడుతుంది. కడుపుబ్బరం వున్న వ్యక్తులు మెంతెపు పొడిని నోట్లో వేసుకుంటే చాలు తగ్గిపోతుంది, లైంగిక సమస్యల నివారణకు కూడా మెంతులు చాలా బాగా పని చేస్తాయి. నాలుకపై ఎటువంటి రుచి తెలియనప్పుడు మెంతులు కొన్నింటిని నోట్లో వేసుకుని నమిలితే చాలు నాలుక 'అరుచి' తొలగిపోతుంది. మెంతులను పొడి చేసుకుని రోజూ నీటిలో లేదా పాలలో సేవించినట్లయితే ముక్కుకు వాసన తెలియటం లేదన్న వారికి మంచి గుణం కనిపిస్తుంది, కఫం వున్న వ్యక్తులకు కూడా ఇది చాలా బాగా పని చేస్తుంది. మెంతులు కొద్దిగా చేదు గుణం కలిగి వుంటాయి కాబట్టి కొందరు వ్యక్తులు తినలేరు. అటువంటి వారు వాటిలో కొద్దిగా కలకండ కలుపుకుని తిన్నా గుణాల్లో ఎటువంటి మార్పు ఉండదు.

**శరీరంలో వచ్చే అలర్జీ మచ్చలకు మెంతులతో వైద్యం :**

కొందరికి పైత్యం, అలర్జీ వల్ల శరీరంపై ఎర్రటి మచ్చలు ఏర్పడుతూ వుంటాయి. అటువంటి వాటి నివారణకు మెంతులను మెత్తటి పొడిగా చేసుకుని, కొద్దిగా నీటిలో కలిపి పేస్టులా తయారు చేసుకుని శరీరానికి పూసుకుని ఒక గంట తర్వాత స్నానం చేస్తే ఇటువంటి మచ్చలు నయమౌతాయి.

**మధుమేహానికి మెంతులు :**

మెంతెపు పొడిని పాలు లేదా నీటిలో కలుపుకుని ఎల్లప్పుడూ సేవించే వారికి మధుమేహం వ్యాధి నియంత్రణలో వుంటుంది. ఎందుకంటే రక్తం చిక్కబడకుండా పలుచగా అయ్యేలా చేసే గుణం మెంతులకు వుంది. శరీరంలో క్రొవ్వును కూడా కరిగించే గుణం వీటికుంది. అందుకే కొంతమంది మెంతులను రాత్రిపూట నానబెట్టుకొని ఉదయమే వాటిని ఏదో ఒక రూపంలో సేవిస్తూ వుంటారు.

**గమనిక : ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.**

బ్రిగేడియర్ గణేశం గారూ,

'పల్లెసృజన' సమాజానికి, పునాది స్థాయి ఇన్నోవేటర్లకు చేస్తున్న సేవలను గురించి, మీ పత్రిక గురించి తెలుసుకుని ఎంతో సంతోషించి, పత్రిక చందా కట్టడం జరిగింది. మీరు పంపిన 4 పత్రికలను పూర్తిగా చదివిన తర్వాత ఎంతో ఆనందానికి గురయ్యాను. ప్రారంభం నుంచి ఇంతవరకు ముద్రించిన పత్రికలన్నీ చదవాలనిపిస్తున్నది. వాటికి సంబంధించిన డబ్బును మీ అకౌంట్‌లో జమ చేయడమైనది. మొత్తం పత్రికలు పంపగలరు. వాటిని త్వరగా చదవాలన్న ఉద్విగ్నత నాలో పెరుగుతోంది.

**– ప్రొఫెసర్ ఎస్. చంద్రన్న,** బెంగుళూరు.

ప్రొఫెసర్ చంద్రన్న గారూ,

మీలాంటి అనువజ్ఞుల అభిమానాన్ని చూరగొనడం 'పల్లెసృజన' చేసుకున్న అదృష్టం. మీలాంటి వారి సహకారాన్ని మేమెల్లప్పుడూ కాంక్షిస్తాము. పత్రికలను పంపుతున్నాము. చదివి మీ అభిప్రాయాన్ని మాతో, పాఠకులతో పంచుకుంటారని ఆశిస్తున్నాము.

**– బ్రిగేడియర్ పోగుల గణేశం.**

వీర రాఘవరెడ్డి గారికి,

నేను ఈమధ్య ఒక మిత్రునివద్ద 'పల్లెసృజన' పత్రికను చదవడమైంది. కేవలం పునాదిస్థాయి ఇన్నోవేషన్లను గురించి సమగ్ర సమాచారం అందిస్తున్న ఈ పత్రిక నాకెంతగానో నచ్చింది. ముఖ్యంగా రైతుల కొరకు మీరు అందిస్తున్న సమాచారం ఎంతో విలువైంది. ఈ పత్రిక తప్పక ప్రతి గ్రామానికి చేరవలసిన పత్రిక. వెంటనే 5 సంవత్సరాల చందాతో పాటు, పాత పత్రికల కొరకు కూడా డబ్బు పంపుతున్నాను. ఇంతవరకు ప్రచురించిన అన్ని పత్రికలు పంప గలరు.

**– రాజశేఖర్ నాగిరెడ్డి,** వెంకటాద్రి గూడెం, పశ్చిమ గోదావరి జిల్లా.

రాజశేఖర్ గారికి,

మీలాంటి వారి సహాయ సహకారాల వల్ల 'పల్లెసృజన' పత్రిక ఎటువంటి ఆటంకాలు లేకుండా 12యేళ్ళ ప్రయాణం పూర్తి చేసుకుంది. మీ అభిమానానికి ధన్యవాదాలు. మీ ప్రాంతాల్లో కూడా ఏవైనా ఇన్నోవేషన్లు ఉంటే తెలుపగలరు. **– వీర రాఘవ రెడ్డి**

## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA) to be published in the first issue every year after the last day of February***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

## రైతుల కోసం రైతులు తయారు చేసిన

# వ్యవసాయ పరికరాలు


4 & 5 హెచ్.పి. మహిపాల్ వీడర్



బాలయ్య స్కూటర్ వీడర్


ప్రవీణ్ స్కూటర్ వీడర్


రవి హీరో హోండా వీడర్


బాబు మొక్కజొన్న విత్తే పరికరం


సుభాని సోలార్ స్ప్రేయర్ మరియు వీడర్


ప్రూనింగ్ కట్టర్


మల్లేష్ యూరియా వెదజల్లే యంత్రం


సోలార్ స్ప్రేయర్



దివ్యజ్యోతి 5 / 7.5 హెచ్‌పి ట్రాక్టర్

**ఇవే కాక 'నిమటోడ్స్' (నులి పురుగు) మందు, 'తులసి', 'పర్‌ఫెక్ట్' సేంద్రియ పురుగు మందు, మరియు పైరు ఎదుగుదలకు మందులు, మరెన్నో పరికరాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి**

కావాల్సిన వారు సంప్రదించండి :

**పల్లెసృజన**

ప్లాట్ నెం. 67, రోడ్ నెం. 2, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500 094.

**ఫోన్ : 040–27111959, 9652801700, 8125799904**

PALLESRUJANA Telugu Bi-monthly May-June 2018 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే



























### చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 350/- | 1,400/- |
| ఐదు సంవత్సరాలకి (నాలుగు పాత సంచికలు ఉచితం) | 800/- | 3,200/- |

పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.

మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904